ఈనాడు తిరుపతి

బుధవారం అక్టోబరు 16, 2024 5

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా సత్యప్రసాద్



ఈనాడు-తిరుపతి: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా అనగాని సత్యప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా రేపల్లె నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఆయనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలకమైన రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను అప్పగించారు. తిరుపతి జిల్లాకు వైకాపా హయాంలో ఎక్కడా ఎటువంటి న్యాయం జరగలేదు. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న నారాయణస్వామికి కొన్ని బాధ్యతలు అప్పగించినా ఆయన పట్టించుకోలేదు. దీంతో ఎమ్మెల్యేలు సైతం ఇక్కడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు అనగాని సత్యప్రసాద్‌ను ఇన్‌ఛార్జి మంత్రిగా బాధ్యతలు అప్పగించడంతో జిల్లాలో అభివృద్ధి పనులు పట్టాలు ఎక్కే ఆస్కారం ఉంది. ఆయన స్వయంగా రెవెన్యూ మంత్రి కావడంతో జిల్లాలో నెలకొన్న అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించేందుకు అవకాశం ఏర్పడింది. రానున్న రోజుల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ద్వారా స్థానిక ప్రజాప్రతినిధులు ఇక్కడ నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటికి పరిష్కారం పొందేందుకు ఆయన నియామకం దోహదపడనుంది.

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల: ఎస్‌ఎస్‌డీ టోకెన్లు లేకుండా మంగళవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. సోమవారం శ్రీవారిని 75,361 మంది దర్శించుకున్నారు. రూ. 3.91 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

రేపు శ్రీవారి పౌర్ణమి గరుడసేవ... పౌర్ణమి సందర్భంగా గురువారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు తిరుమలలో గరుడసేవ జరగనుంది.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలోని నడికుడి-శ్రీకాళహస్తి మధ్య రైల్వే లైన్‌కు సంబంధించిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైల్వేలైన్‌కు అవసరమైన దాదాపు 182 ఎకరాల డీకేటీ భూములకు సంబంధించి సమస్య ఉన్నట్లు తెలిపారు. ఆయా భూములను రైల్వేశాఖకు త్వరగా అప్పగించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. అంతకుముందు అమరావతి నుంచి సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, రైల్వేశాఖ ఉన్నతాధికారులు వర్చువల్ సమావేశం నిర్వహించారు.

రెండో రోజు జడివాన

స్వర్ణముఖిలో పెరుగుతోన్న ప్రవాహం

తక్షణ సహాయ కార్యక్రమాల్లో యంత్రాంగం

అత్యధికంగా తడలో				
తడ 166.05 మి.మీ.	పుత్తూరు 20.6	పిచ్చాటూరు 18.08	నారాయణవనం 18.06	సత్యవేడు 16.08
కేవీబీపురం 14.02	వరదయ్యపాళెం 14	రేణిగుంట 13.06	తిరుపతి అర్బన్ 13.04 మి.మీ.	

ఈనాడు డిజిటల్, తిరుపతి; న్యూస్‌టుడే, తిరుపతి కలెక్టరేట్, నాయుడుపేట పట్టణం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం బలపడింది. జిల్లా వ్యాప్తంగా ఉదయం చిరుజల్లులు కురవగా, మధ్యాహ్నం నుంచి కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది. పెళ్లకూరు మండలం కల్లూరు వద్ద స్వర్ణముఖిలో వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. కేవీబీపురం మండలంలోని కాళంగి జలాశయానికి వరద చేరుతోంది. జిల్లా యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సహాయ చర్యలు చేపట్టింది.

విద్యాసంస్థలకు సెలవు.. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, జూనియర్ కళాశాలలకు కలెక్టర్ వెంకటేశ్వర్ సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తీరప్రాంతాలైన కోట, చిల్లకూరు, వాకాడు, తడ మండలాల్లో అధికారులు పెద్దఎత్తున సహాయ చర్యలు చేపట్టారు.

● దొరవారిసత్రం మండలంలోని తీరప్రాంతాల్లో ప్రత్యేక అధికారి టీవీఎస్ శోభన్‌బాబు పర్యటించారు. నిత్యావసర సరకులు అందుబాటులో ఉండేలా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. వాకాడు, బాలాయపల్లి పరిధిలో విద్యుత్తు అంతరాయం ఏర్పడగా సిబ్బంది సహాయ చర్యల్లో నిమగ్నమయ్యారు. చెరువులు, కాలువల కరకట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నచోట అప్రమత్తంగా ఉన్నారు.


తిరుమలలో చలి తీవ్రత

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గాలులతో చలితీవ్రత బాగా పెరిగింది. అలిపిరి నడకమార్గంలో భక్తులు వర్షంలోనే నడుస్తూ తిరుమల చేరుకున్నారు. తితిదే ఇంజినీరింగ్ శాఖ ఘాట్ రోడ్లలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. సొంత వాహనాల్లో ఘాట్‌రోడ్లలో ప్రయాణించే వారిని అలిపిరి వద్ద తితిదే సిబ్బంది అప్రమత్తం చేస్తున్నారు.





తిరుపతిలో...





పద్మావతి వర్సిటీలో నేలకొరిగిన వృక్షం



వర్షాలకు తలకోన జలపాత ఉద్ధృతి



తడుస్తూ కొండెక్కుతున్న శ్రీవారి భక్తులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని... ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, ఇళ్ల నుంచి బయటకు రావద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. వరద సహాయ చర్యలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రం, డివిజన్, మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. తీరప్రాంతాలైన కోట, చిల్లకూరు, వాకాడు మండలాలు, సూళ్లూరుపేట డివిజన్ పరిధిలోని తడ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా విపత్తును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను గూడూరు సబ్ కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంచామని చెప్పారు.



నాయుడుపేట పట్టణం: తుమ్మూరు వద్ద ప్రధాన మురుగు కాలువలో పూడిక తీసిన దృశ్యం



దొరవారిసత్రం: స్థానికులతో మాట్లాడుతున్న తుపాను ప్రత్యేకాధికారి శోభన్‌బాబు

తెరిపినివ్వని వర్షం.. తెరపడని రోగుల కష్టం

రుయా ఆసుపత్రికి వచ్చిన రోగులు వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం వివిధ విభాగాలకు పరీక్షల నిమిత్తం వర్షంలోనే తడుస్తూ వెళ్లారు. వారి బంధువుల కోసం ప్రత్యేకంగా గది లేకపోవడంతో అత్యవసర విభాగం వద్ద అంబులెన్సులు నిలిపే ప్రదేశంలో ఆశ్రయం పొందుతున్నారు. రోగులను తరలించే వాహనం అలంకారప్రాయంగా మారింది.





వర్షంలోనే రోగులను విభాగాలకు తీసుకువెళ్తూ..



ప్రత్యేక గది లేకపోవడంతో అవస్థలు



నిరుపయోగంగా వాహనం

శివయ్యకు వరుణాభిషేకం



శ్రీకాళహస్తి ఆలయంలోని అష్టోత్తర శివలింగానికి వెనుక బిల్వవృక్షం కింద ఉన్న శివలింగంపై వర్షధారలు పడటంతో భక్తులు పులకించిపోయారు. అల్పపీడన ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురుస్తుండటంతో నీటిధారలన్నీ శివలింగంపై పడటంతో భక్తులు ఆనంద పరవశులయ్యారు. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

డ్రగ్స్ రవాణా అంటూ సైబర్ మోసం

రుణ యాప్‌ల లింకులతో రూ.4.9 లక్షలు స్వాహా

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మీ పేరుతో ఉన్న పార్సిల్‌లో మెడికల్ డ్రగ్స్ ఉన్నాయని, సైబర్ పోలీసుల విచారణ అంటూ రూ. లక్షల్లో నగదు కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు వివరాల మేరకు.. రూరల్ పీఎస్ పరిధిలోని ఎంకేనాయుడు కాలనీలో రావెళ్ల నరేంద్ర నివాసం ఉంటున్నారు. బెంగళూరులోని ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈనెల 10న ఓ ఫోన్ నుంచి కాల్ వచ్చింది. తాము ముంబయి కొరియర్ సర్వీసు నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ పేరుతో ఇరాన్ వెళ్తున్న పార్సిల్‌లో మెడికల్ డ్రగ్స్‌ను గుర్తించి దుబాయ్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సైబర్ పోలీసుల విచారణ అంటూ స్కైయాప్‌లో వీడియో కాల్‌చేసి బెదిరించారు. లోన్ యాప్‌ల నుంచి ఐదు లింకుల ద్వారా అతని ఐసీఐసీఐ ఖాతాను అనుసంధానం చేస్తూ రూ.5 లక్షల రుణం ఇప్పించారు. అందులోని రూ. 4.90 లక్షలు వారి ఖాతాకు బదలాయించుకున్నారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

పలు రైళ్ల రద్దు

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో తిరుపతి నుంచి తమిళనాడు రాష్ట్ర మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతి- చెన్నై సెంట్రల్ (16203) తిరుపతి ఎక్స్‌ప్రెస్, తిరుపతి- చామరాజనగర్ (16220) కాట్పాడి మీదుగా కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు.

మద్యం దుకాణం.. మారు బేరం

- ☛ గుడ్‌విల్ పేరుతో రూ.30-40 లక్షలు
- ☛ పట్టణాల్లో సిండికేట్ల హడావుడి



గూడూరు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలు దక్కని సిండికేట్లు మారు బేరాలు చేస్తున్నారు. ప్రభుత్వం లిక్కర్ పాలసీ పారదర్శకంగా తీసుకొచ్చి అమలు చేసింది. ఎక్కడా రాజీపడని పరిస్థితి కాగా.. సిండికేట్లు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గుడ్‌విల్ పేరుతో దుకాణానికి రూ.30 లక్షలు ఇస్తామంటూ సందేశాలిస్తున్నారు. ఇలా ఒకటి, రెండు దుకాణాలు వచ్చిన వారిని నయానో భయానో మచ్చిక చేసుకుని దారిలోకి తెచ్చుకునే యత్నాలు చేస్తున్నారు.

జిల్లాలో 227 మద్యం దుకాణాలకు కేటాయింపులు పూర్తి చేశారు. సుమారుగా రూ.78 కోట్లు దరఖాస్తుల ద్వారా ఆదాయం సమకూరింది. వీటిని 16 నుంచి ప్రారంభించనున్నారు. తిరుపతి నగరంలో అత్యధికంగా 32 దుకాణాలు కాగా.. ఇక్కడ బడాబాబులు రంగంలో నిలిచారు. గూడూరు పురపాలికలో 12 దుకాణాలు, నాయుడుపేట పురపాలికలో 13 దుకాణాలు, సూళ్లూరుపేటలో 14, వెంకటగిరిలో 9, శ్రీకాళహస్తిలో 12 దుకాణాలకు కేటాయింపులు పూర్తి చేశారు. ఇక్కడ దుకాణాలు దక్కని సిండికేట్లు మారుబేరాలు సాగిస్తున్నట్లు సమాచారం.

ప్రలోభాలు షురూ..

లాటరీలో వచ్చిన మద్యం దుకాణం మాకు ఇవ్వండి.. రూ.30 లక్షలు ఇస్తామంటూ గూడూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఒకే దుకాణం దక్కిన వ్యక్తికి ఫోన్ చేయడం చర్చనీయాంశమైంది. ఇక్కడి దుకాణాలు ఎక్కువగా గతంలో ఉన్న మద్యం వ్యాపారులకే వచ్చాయి. దీంతో వారంతా ఒకరిద్దరున్న వారితో బేరాలు సాగిస్తున్నారు. ఇదే విధంగా సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల వారితోనూ సంప్రదింపులు చేస్తున్నారు. తిరుపతి నగరంలో సిండికేట్ ఏక మొత్తంగా దక్కించుకునే ఎత్తుగడలో ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

బినామీలపై ఆదాయ పన్ను శాఖ ఆరా!

మద్యం దుకాణాలు దక్కించుకున్న చాలా మందికి సిండికేట్ల బినామీలున్నారు. వారి పేర్లతో దుకాణాలు రావడం చర్చనీయాంశమైంది. వీరి జాబితా ఆదాయ పన్ను శాఖకు వెళ్లనున్నట్లు సమాచారం. ఆపై ఆ శాఖ వారి గురించి వాకబు చేయనుంది. ఇలా దుకాణాలు దక్కించుకున్నదెవరు. వారి వెనకున్నదెవరనే చర్చ ప్రస్తుతం నడుస్తోంది.. ఇలా పెళ్లకూరు మండలానికి చెందిన ఓ వ్యక్తికి నాయుడుపేటలో దుకాణం వచ్చింది. సదరు నేత వెనుక వైకాపాకు చెందిన కీలక నేత ఉన్నారు. వివిధ ప్రాంతాల్లో బినామీలు దుకాణాలు దక్కించుకోవడంతో వారందరి గురించి ఆరా తీయనున్నట్లు సమాచారం. గతంలో ఇదే విధంగా తెల్ల కార్డుదారులు దుకాణాలు నిర్వహించడంపై కేసులు నమోదైన విషయం తెలిసిందే.

లక్కు తగిలినా డబ్బు చెల్లించని ఇద్దరు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మద్యం దుకాణాల లాటరీలో ఎంపికైన ఇద్దరు టెండరుదారులు మంగళవారం రాత్రివరకు ఆరోవంతు లైసెన్సు ఫీజు చెల్లించలేదు. 227 మద్యం దుకాణాలకు టెండర్లు నిర్వహించారు. ప్రతి దుకాణానికి ముగ్గురిని ఎంపిక చేశారు. మొదటి వ్యక్తి నగదు చెల్లించకుంటే రిజర్వుగా ఎంపిక చేసిన వారికి కేటాయించే అవకాశం ఉంది. తొట్టంబేడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 75వ దుకాణానికి.. పాకాల పీఎస్ పరిధిలోని 133వ దుకాణానికి ఎంపికైన మొదటి వ్యక్తులు లైసెన్సు ఫీజు మొదటి కంతు చెల్లించలేదు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మిగిలిన 225 దుకాణాలకు లాటరీలో ఎంపికైన మొదటి వ్యక్తులు ఫీజు చెల్లించి తాత్కాలిక లైసెన్సు పొందారని తెలిపారు.


బడికి.. గుడికి దూరంగా

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీ బుధవారం నుంచి అమలు కానుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణం ఏర్పాటును పరిశీలించి శాశ్వత అనుమతులు మంజూరు చేస్తారు. అందులో ప్రధానంగా ప్రభుత్వం గుర్తించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల దూరంలో మద్యం దుకాణం నెలకొల్పాలి. రాష్ట్ర దేవాదాయశాఖ గుర్తించిన ఆలయాలు, వక్ఫ్‌బోర్డు అనుమతించిన మసీదులు, ప్రభుత్వం అనుమతించిన చర్చీలకు వంద మీటర్ల ఆవల ఏర్పాటు చేసుకోవచ్చు. 30 పడకలకు మించి ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రుల పరిధిలో ఇదే నిబంధన వర్తిస్తుంది. నగరపాలక, పురపాలక సంస్థల మీదుగా జాతీయ, రాష్ట్ర రహదారులు వెళ్లినా మద్యం దుకాణాల ఏర్పాటుకు అభ్యంతరం లేదు. 20 వేల కన్నా తక్కువ జనాభాగల గ్రామాల మీదుగా జాతీయ, రాష్ట్ర రహదారులు వెళ్తుంటే.. 220 మీటర్లకు దూరంగా దుకాణాలు ఉండాలి. 20 వేల జనాభా కన్నా అధికంగా ప్రజలు ఉన్న గ్రామాల్లో జాతీయ, రాష్ట్ర రహదారుల హైవేలు ఉంటే 500 మీటర్లకు దూరంగా ఏర్పాటు చేసుకోవచ్చు.

తిరుపతిలో ఎక్కడెక్కడ కుదరదంటే..

తిరుపతి నగరం నుంచి తిరుమలకు వెళ్లే ప్రధాన మార్గంలో మద్యం దుకాణాలు నిషేధించారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండు, విష్ణు నివాసం, శ్రీనివాసం, కపిలతీర్థం, అలిపిరి.. ఇక్కడి నుంచి రుయా, స్విమ్స్ ఆస్పత్రుల కూడలి వరకు ఉన్న బైపాస్ రోడ్డుకు ఇరువైపులా మద్యం దుకాణాల ఏర్పాటు చేయకూడదు. రోడ్డుకు ముందున్న దుకాణాలు కాకుండా రెండో భవనం నుంచి దుకాణాలు పెట్టుకోవచ్చు.

టెట్‌కు 2,093 మంది హాజరు.. తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా మంగళవారం నాలుగు కేంద్రాల్లో జరిగిన టెట్‌కు మొత్తం 2,093 మంది హాజరయ్యారు.





అర్హత లేకున్నా హక్కులు..!

- ☛ నిబంధనలు అతిక్రమించి భూముల ఫ్రీహోల్డ్
- ☛ రెవెన్యూ అధికారుల మాయాజాలం

ఈనాడు-తిరుపతి: ఫ్రీహోల్డ్ భూముల పేరుతో పేదల స్థలాలను నాటి వైకాపా నేతలు కొందరు అడ్డగోలుగా కొట్టేశారనే ఆరోపణలకు అధికారుల నివేదికలు బలాన్ని చేకూరుస్తున్నాయి. జిల్లా పరిధిలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి జరిగిన రిజిస్ట్రేషన్లలో 535 ఎకరాల (36.6 శాతం)ను అడ్డగోలుగా కట్టబెట్టారని తేలింది. నాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అతిక్రమించి అర్హత లేని వ్యక్తుల పేర్లకు ఆమోదం తెలియజేయడంతోపాటు 2003 తర్వాత ఇచ్చిన అసైన్డ్ భూములకు సైతం ఫ్రీహోల్డ్ కల్పించి అక్రమాలకు తెరలేపారు. ఇందులో కొన్ని భూములను ఇప్పటికే ఇతరుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేశారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అసైన్డ్ భూములను కొట్టేసేందుకు వైకాపా హయాంలో పథకాన్ని రచించారు. 2003 ముందు ఇచ్చిన అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అక్రమాలను గ్రహించిన కూటమి ప్రభుత్వం జిల్లాలోని శ్రీకాళహస్తి మండలాన్ని ఎంపిక చేసి అక్కడ జరిగిన రిజిస్ట్రేషన్లు తనిఖీ చేయించింది. రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా భూములకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించడంతో రిజిస్ట్రేషన్లు జరిగేందుకు అవకాశం ఏర్పడిందని ప్రభుత్వానికి నివేదిక అందించారు. జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు జరిగిన భూములను పరిశీలించాలని ప్రభుత్వం మరోమారు ఆదేశించింది.

అడ్డగోలుగా ఎక్కించారు.. నాటి ఉత్తర్వుల ప్రకారం 2003కి ముందు అసైన్‌మెంట్ భూములకు మాత్రమే ఫ్రీహోల్డ్ హక్కు కల్పించాల్సి ఉన్నా తర్వాత ఇచ్చిన వాటికి చేశారు. కొన్ని మండలాల్లో లబ్ధిదారు పేరుతో కాకుండా ఇతర పేర్లు పొందుపరిచారు. పోరంబోకు, భూమార్పిడి జరగనివి, 2003 తర్వాత కేటాయించిన భూములకు ఫ్రీహోల్డ్ కల్పించారు. రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిల్లో 36.6 శాతం ఉన్నట్లు తేల్చారు. ఏర్పేడు మండలం వికృతమాల పరిధిలో 23.96 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేస్తూ నాటి కలెక్టర్ వెంకటరమణారెడ్డి జనవరి 9వ తేదీన ఒక ప్రొసీడింగ్ ఇచ్చారు. వాటిల్లో కొన్నింటికి ఫిబ్రవరి 16న రిజిస్ట్రేషన్లు జరిగాయి.

రిజిస్ట్రేషన్ కానివి.. ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన వాటిల్లో రిజిస్ట్రేషన్ జరిగినవి 3 శాతం మాత్రమే. రిజిస్ట్రేషన్ జరగని వాటిని పరిశీలిస్తున్నారు. జనవరి నెలలో ప్రొసీడింగ్స్ జారీ జయడంతో రిజిస్ట్రేషన్లు తక్కువగా జరిగాయని, అయితే రెవెన్యూ రికార్డుల్లో మాత్రం అడ్డగోలుగా మార్చారనే ఆరోపణలున్నాయి. వీటి పరిశీలన పూర్తయితే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే ఆస్కారం ఉంది.

- ఫ్రీహోల్డ్‌కు అర్హత ఉన్న భూములు : 76,210.04 ఎకరాలు
- ఫ్రీహోల్డ్ చేసినవి: 44,716.54
- రిజిస్ట్రేషన్ జరిగినవి: 1,461 ఎకరాలు
- రెవెన్యూ తప్పిదాలతో చేసినవి: 535 ఎకరాలు



పాడె మోయాలంటే
పాడెక్కేందుకు సిద్ధపడాలా..?

సహచరుని అంత్యక్రియల్లో పాడెను మోయాలంటే తాము సైతం పాడెను ఎక్కేందుకు తెగించాల్సిన పరిస్థితి నాగలాపురం మండలంలోని కస్తూరినాయుడుకండ్రిగలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్టీకాలనీకి చెందిన శంకర్(52) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా.. ఆయన అంత్యక్రియలను కుటుంబ సభ్యులు, బంధువులు పూర్తి చేశారు. మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లే దారిలో అరణియార్ నది కాలువ ప్రవహిస్తుండటంతో నడుములోతు నీటిలో ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు చేరువగా పాడెను తీసుకెళ్లాల్సి వచ్చింది. రెండు రోజుల కిందట కారణిలో ఒకరి అంత్యక్రియలకు వెళ్లి వడివేలు నీటిలో కొట్టుకుపోయి మృతి చెందగా.. తాజాగా ఇదే పరిస్థితి సమీప గ్రామాల్లోనూ నెలకొనే పరిస్థితులు భయాందోళనలు కలిగిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, నాగలాపురం

నేర్పు.. జలవనరుల కూర్పు

తిరుపతి ఐఐటీకి జాతీయ స్థాయి గుర్తింపు

శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే: 'వృథా నీటికి అడ్డుకట్ట వేయడం.. ఆ నీటితో అద్భుతమైన పచ్చదనం విస్తరించేలా చేయడంలో తిరుపతి ఐఐటీ అద్భుతమైన నేర్పును కనబర్చింది.' చూడగానే ఆకట్టుకునే రీతిలో ప్రాంగణంలో చేపట్టిన జల సంరక్షణ కూర్పునకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును సాధించడం విశేషతను సంతరించుకుంది. జలం జీవన ప్రగతికి నిదర్శనం అన్న అక్షర సత్యాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చాటడం జల సంరక్షణలో ఆదర్శ ప్రాయంగా నిలిచి ఉత్తమ ఫలితాలను సాధించిన గ్రామాలు, సంస్థల కృషిని కేంద్ర జలశక్తి శాఖ గుర్తించింది. 2023వ సంవత్సరానికి నిర్వహించిన పోటీల్లో ఏర్పేడులోని తిరుపతి ఐఐటీలో జలసంరక్షణ కూర్పునకు జాతీయ స్థాయిలో స్పెషల్ మెన్షన్ అవార్డును దక్కించుకోవడం విశేషతను సంతరించుకుంది.



పచ్చదనం విస్తరణతో ఐఐటీ భవనాలు

సంరక్షణే లక్ష్యం

జల సంరక్షణ ప్రధాన లక్ష్యంగా ఐఐటీ కృషికి సర్వత్రా ప్రశంసలు వచ్చాయి. ప్రధానంగా ఐఐటీ భవనాలన్నీ కొండలను ఆనుకుని ఉన్నాయి. వర్షాకాలంలో ఆ కొండల్లో నుంచి వచ్చే వర్షపు నీరంతా గతంలో వృథా అవుతూ వచ్చేది. ఐఐటీ భవన నిర్మాణాలు చేపట్టాక ఆ నీటిని పూర్తి స్థాయిలో సంరక్షించాలన్న లక్ష్యంతో ప్రాంగణంలో రెండు పెద్ద చెరువులను మరింత అందంగా తీర్చిదిద్దింది. ఇక్కడ 8.37 కోట్ల లీటర్ల నీటి లభ్యత ప్రధానాంశంగా వంద శాతం జలసంరక్షణకు శ్రీకారం చుట్టింది. అంతేకాకుండా ఇక్కడ నీటి నిల్వలతో ప్రాంగణంలో 5200 మొక్కలను నాటారు. ఇవన్నీ దీర్ఘకాలంతో పాటు ఏపుగా ఎదిగే వాటికి ప్రాధాన్యత ఇచ్చి నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తూ పచ్చదనం విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంగణం చుట్టూ ఉన్న అటవీ ప్రాంతానికి అనుబంధంగా ఈ మొక్కల పెంపకం మరింత ఆహ్లాదాన్ని పంచేలా ఐఐటీకి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది.



మొక్కలు, నీటితో ఆహ్లాదకరంగా ఐఐటీ ప్రాంగణం



దత్తత గ్రామాల్లోనూ..

పచ్చదనం ఉంటే ఆహ్లాదం కన్పిస్తుంది. ప్రస్తుతం జల సంరక్షణ చర్యల్లో ఐఐటీ ప్రాంగణంలోనే కాకుండా తాము దత్తత తీసుకున్న అన్ని గ్రామాల్లోనూ మొక్కలు నాటించాం. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల సహకారంతో జలసంరక్షణ.. పచ్చదనం విస్తరణ లక్ష్యంగా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాం. జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించడం ఆనందంగా ఉంది.

– సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ తిరుపతి

దోచినా దాచేస్తాం



మార్కెట్ యార్డులోని గోదాం

- గోప్యంగా రూ.2.05 కోట్ల బియ్యం అవినీతి వ్యవహారం
- లోతుగా విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి

పుత్తూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ కొలువు దీరాక అన్ని విషయాల్లో నిక్కచ్చిగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కొందరు అధికారులు మాత్రం ఇప్పటికీ వైకాపా ప్రభుత్వ వాసనలు వీడటం లేదు. కొన్ని శాఖల్లో అవినీతి జరుగుతున్నా గోప్యంగా ఉంచుతున్నారు. తాజాగా పుత్తూరు పౌరసరఫరాలశాఖ గోదాంలో జరిగిన అవినీతిని అధికారులు దాచేయడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. పుత్తూరు గోదాం సీఎస్‌డీటీగా విష్ణు గత ప్రభుత్వ హయాం నుంచే ఇక్కడే పనిచేస్తున్నారు. ఈ గోదాంలో రేషన్ బియ్యానికి సంబంధించి రూ.2.05 కోట్ల అవినీతి జరిగినట్లు ఆ శాఖ ఉన్నతాధికారిణి తనిఖీల్లో వెల్లడైనా గోప్యంగా ఉంచారు.

పుత్తూరు పౌరసరఫరాలశాఖ గోదాం పరిధిలో పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట మండలాలున్నాయి. వీటి పరిధిలో 109 రేషన్ దుకాణాలున్నాయి. ప్రతి నెలా ఈ దుకాణాలకు పుత్తూరు గోదాం నుంచి 25 వేల బస్తాలు బియ్యం డీలర్లకు అందజేస్తుంటారు. ఈ క్రమంలోనే అవినీతి చోటుచేసుకుంది. గత నెల తిరుపతి జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు డీఎం సుమతి సమక్షంలో పుత్తూరు గోదాంను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. గోదాంలో ఉన్న స్టాకు.. అక్కడ నిల్వ ఉన్న స్టాకులో వ్యత్యాసాన్ని గుర్తించారు. దీంతో మొత్తం రికార్డులు తనిఖీ చేశారు. సుమారు 205 టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. దీనిపై ఈనెల 12న పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్నో అనుమానాలు

205 టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్లు లెక్కల్లో సెప్టెంబరు 25నే తేలింది. జేసీ వద్ద అదే రోజు నివేదిక ఇచ్చారు. సెప్టెంబరు 27న విష్ణును సస్పెండ్ చేస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ ఫైల్‌పై సంతకం చేశారు. ఈ నెల 12న విజయదశమి రోజున పౌరసరఫరాలశాఖ అధికారులు పుత్తూరు సీఐ సురేంద్రనాయుడుకు అవినీతికి పాల్పడ్డ సీఎస్‌డీటీ విష్ణుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని అటు పౌరసరఫరాలశాఖ అధికారులు, పోలీసులు గోప్యంగా ఉంచారు. మీడియాకు వెల్లడించలేదు. ఈ విషయంలో జేసీ పాత్రపై కూడా పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఈ విషయం ఎక్కడ బయటకు పొక్కనీయకుండా ఆయన కనుసన్నల్లోనే జరిగినట్లు ఆ శాఖ అధికారులే వెల్లడించడం గమనార్హం.

దొంగలు పడిన ఆరు నెలలకు..

అవినీతికి పాల్పడ్డ సీఎస్‌డీటీ విష్ణు అజ్ఞాతంలోకి వెళ్లాక పౌరసరఫరాలశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల రోజుల వ్యవధిలోనే 205 టన్నులు బియ్యం అక్రమంగా తరలించారనేది అవాస్తవం. ఈ తతంగం ఎప్పటి నుంచో జరుగుతోంది. ఇదంతా ఆ శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరిగినట్లు సమాచారం. ఆ శాఖలో జరిగిన అవినీతి బట్టబయలు కావాలంటే కలెక్టర్ దీనిపై నిష్పక్షపాతంగా విచారణ చేయిస్తే మరింత మంది పాత్రదారుల గుట్టు రట్టయ్యే అవకాశాలున్నాయి. కాగా.. విష్ణును తొలగించాక శ్రీకాళహస్తి సీఎస్‌డీటీ రమేష్‌బాబుకు పుత్తూరు గోదాం అదనపు బాధ్యతలు అప్పగించారు.



విష్ణు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ రమణ కుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రమణ కుమార్ హెచ్చరించారు. గూడూరు పరిసర ప్రాంతాల్లో ఓ బాలుడిని కొందరు యువకులు కొడుతున్నట్లు సామాజిక మాధ్యమంలో వచ్చిన వీడియోపై స్పందించి.. స్థానిక ఎస్కేఆర్ కళాశాల సమీపంలో ఆగస్టు 22న జరిగినట్లు డీఎస్పీ వెల్లడించారు. స్థానిక రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెల్లూరు జిల్లా సైదాపురం మండలానికి చెందిన ఓ బాలుడు గూడూరు రెండో పట్టణంలో తన అక్క ఇంట్లో ఉంటున్నాడు. ఎస్కేఆర్ కళాశాలలో చదువుతున్న తిలక్‌నగర్‌కి చెందిన ఓ బాలుడితో పరిచయం ఏర్పడింది. దీంతో తిలక్‌నగర్‌కి చెందిన బాలుడు తన స్నేహితులను తీసుకొచ్చి సైదాపురానికి చెందిన బాలుడిని కొట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరించడంతో బాధితుడు మౌనంగా ఉన్నట్లు చెప్పారు. ఈ ఘటన వీడియో వైరల్ కావడంతో బాధిత బాలుడు మంగళవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టణ సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రగిరి సీఐ దుర్భాషలాడారని ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం): భూమి రిజిస్ట్రేషన్ విషయమై చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తనను స్టేషన్‌కు పిలిచి దుర్భాషలాడారని పనపాకం పంచాయతీ పాకాల వారిపల్లెకు చెందిన పాశం గురుమూర్తి ఆరోపించారు. ఆ మేరకు ఎస్పీ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేశారు. తనకు తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తిపై 2021లో గడ్డంవారిపల్లెకు చెందిన జనార్దన్ నాయుడుకి విక్రయ అగ్రిమెంటు చేశామని, ఆన్‌లైన్‌లో తనపేరు మీద మారిన తర్వాత రిజిస్ట్రేషన్ చేయిస్తానని హామీ ఇచ్చానన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు భూమి ఆన్‌లైన్ కాకుండా అడ్డుకుంటూనే ఆయనకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. స్థలానికి పక్కనే ఉన్న 2.50 ఎకరాల భూమి కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడ్డ సీఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ఇంటి ముందు కూర్చొని ఉన్న మహిళతో మాటలు కలిపిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించారు. ఈ ఘటన శ్రీకాళహస్తి రెండో పట్టణ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. స్థానిక కుందేటివారివీధికి చెందిన సుశీల ఇంటి ముందు కూర్చొని ఉండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె వద్దకు వచ్చి సమాచారం అడుగుతున్నట్లు మాటలు కలిపారు. ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కోవడంతో సగ భాగం తెగిపోవడంతో దాన్ని తీసుకుని దుండగులు పరారయ్యారు.

ఎస్వీయూలో స్పాట్, ప్రత్యేక ప్రవేశాలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలోని ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ల గడువు తేదీని ఈనెల 21 వరకు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తెలిపారు. వివరాలకు డీవోఏ డైరెక్టర్ ఆచార్య రమేష్ బాబును 0877-2248589లో సంప్రదించాలని సూచించారు. ఎంటెక్‌లో (కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో ఎం.ఫార్మసీ, బి.ఫార్మసీ కోర్సుల్లోనూ ప్రత్యేక రుసుముతో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

తితిదే నూతన వీజీవోగా సదాలక్ష్మి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తితిదే తిరుపతి నూతన వీజీవోగా సదాలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఈ స్థానంలో ఉన్న నందకిషోర్‌కు పదోన్నతి రావడంతో ఆయన్ను చిత్తూరు ఏఆర్ అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. మరో ఏడాది సర్వీస్ ఉన్న సదాలక్ష్మి తెలంగాణలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు బదిలీపై వచ్చారు.

ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన ఎల్ఎల్‌బీ నాన్ సీబీసీఎస్ మొదటి సెమిస్టర్ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారి దామ్లానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలను ఎస్వీయూ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

'మొదటి ర్యాంకు వచ్చినా పీహెచ్‌డీ ప్రవేశం లేదు'

ఈనాడు డిజిటల్, తిరుపతి: రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఎస్వీయూ ఆధ్వర్యంలో 2023-24 ఏడాదికిగాను నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశాల్లో అన్యాయం జరిగినట్లు అనకాపల్లి జిల్లాకు చెందిన బండారు మోహన్ ఆరోపిస్తున్నారు. లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీకిగాను 139 మార్కులతో మొదటి ర్యాంకు సాధించినా సీటు రాలేదని, ఆ విభాగంలో ఆరు ఖాళీలు ఉండగా తన తరువాతి ర్యాంకు వచ్చిన అభ్యర్థులకు సీట్ కేటాయించారన్నారు. దీనిపై ఏపీ ఆర్‌సెట్ కన్వీనర్‌ను సంప్రదించగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అంటూ సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆర్టీఐ దరఖాస్తు దాఖలు చేసినట్లు వెల్లడించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	135
రిటైల్	157
లేయర్	120
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	259
లేయర్ మాంసం	204

జే బ్రాండ్లకు సెలవిక

మూతపడ్డ ప్రభుత్వ మద్యం దుకాణాలు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: బూమ్ బూమ్.. బ్రిటీష్ ఎంపైర్.. దారూహౌస్.. రాయల్ ఆమ్స్.. మంజీరా.. ఛాంపియన్స్.. అమరావతి తరహా జగన్ బ్రాండ్లకు కాలం చెల్లింది. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ అమలు పరచడంతో.. ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం రాత్రి మూతపడ్డాయి. 'కాపురాల్లో మద్యం చిచ్చు పెడుతోంది.. మానవ సంబంధాలు పూర్తిగా మంటగలిసి పోతున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు దశల్లో మద్యాన్ని సంపూర్ణంగా నిషేధిస్తా'నని ఎన్నికల మేనిఫెస్టోలో వైఎస్ జగన్ ప్రకటించి.. తీరా అధికారం చేపట్టాక ఐదేళ్లు జే బ్రాండ్లతో మందుబాబుల అంతుచూశారు. నాసిరకం మద్యం తాగి మందుబాబులు ఆస్పత్రుల పాలయ్యారు. కాలేయం, మూత్రపిండాలు పాడై ఎంతోమంది మరణించారు. జే బ్రాండ్లు తాగి మతిస్థిమితం కోల్పోయి మానసిక వ్యాధులకు గురయ్యారు. వాటాల కోసం గతంలో ఉన్న నాణ్యమైన మద్యాన్ని సామాన్యులు, పేదలకు దూరం చేశారు. మధ్య తరగతి, ఉన్నత వర్గాలు అధిక ధరలు చెల్లించి బార్లకు వెళ్లినా.. అక్కడా అరకొర నాణ్యత కలిగిన మద్యమే తాగాల్సి వచ్చిందనే ఆవేదన వారిలో ఉంది. ఎప్పుడెప్పుడు జే బ్రాండ్ల బాధ నుంచి ఉపశమనం కలుగుతుందా.. అని ఎదురుచూసి సార్వత్రిక ఎన్నికల్లో కసిగా తీర్పునిచ్చారు.

రూ.99కే క్వార్టర్ సీసా

ఐదేళ్లు ఫలానా మందు కావాలని చెప్పే పరిస్థితి లేక.. రూ.150 మందు, రూ.200 మందు అని అడిగే పరిస్థితి ఉండేది. అంత ధర పెట్టినా నాసిరకం మద్యం లభించేది. కొనుగోలు చేశాక ఇంటికి తీసుకెళ్లలేక.. రోడ్లపై తాగి పోలీసులతో కేసులు పెట్టించుకున్న పరిస్థితులు ఆనాటివి. మందుబాబుల కష్టాలు గుర్తించిన కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చింది. రూ.99లకే నాణ్యమైన క్వార్టర్ మద్యం బాటిల్ అందించనుంది. ఇతర బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి.

గూడూరు మినహా తిరుపతి డివిజన్‌లో విక్రయాలు ఇలా..

ఏడాది	రూ.కోట్లు
2019–20	400
2020–21	735
2021–22	951
2022–23	1018
2023–24	1076
2024–25 (ఏప్రిల్-సెప్టెంబరు)	539

నిల్వలు, చెల్లింపులపై ఆరా..

2019 అక్టోబరు నుంచి ప్రజల ముందుకొచ్చిన ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం రాత్రి మూతపడ్డాయి. జిల్లాలోని 243 దుకాణాలను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం నిల్వలు, చెల్లింపులు ఆరాతీసి తేడా ఉంటే సూపర్‌వైజర్‌పైన చర్యలు తీసుకోనున్నారు. గతంలోనూ డబ్బులు చెల్లించక.. అధిక ధరలకు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేశారు.

గుండెజబ్బుల విభాగం పునరుద్ధరించండి

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: సామాన్య నిరుపేద రోగులు వచ్చే రుయా ప్రభుత్వ ఆస్పత్రిలో మూతపడ్డ గుండె జబ్బుల విభాగాన్ని పునరుద్ధరించాలని కేంద్ర మాజీ మంత్రి డా.చింతామోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం రుయా ఆస్పత్రిలో ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరిటెండెంట్ డా.రవిప్రభుతో సమస్యపై చర్చించారు. ముఖ్యమంత్రి, తితిదే ఈవో సామాన్యులను ఉద్ధరిస్తున్నట్లు చెప్పడం తప్ప.. రుయా ఆస్పత్రిని అభివృద్ధి చేయడం లేదని ఆరోపించారు. రోజూ వందలాది నిరుపేదలు వైద్యం కోసం వస్తుంటే.. అత్యవసరమైన గుండె జబ్బుల విభాగం లేకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం డాక్టర్ మాత్రమే ఉన్నారని. . నెలరోజుల్లో గుండె జబ్బుల విభాగాన్ని పునరుద్ధరించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, రవి, రావణ్, తేజోవతి, శాంతియాదవ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న చింతామోహన్ తదితరులు

నిధుల విడుదల తాత్కాలిక నిలుపుదల

ఈనాడు-తిరుపతి: తిరుమల నడకదారితో పాటు కనుమ దారుల్లో వన్యమృగాలను పసిగట్టడంతోపాటు వాటిని పట్టుకునేందుకు అవసరమైన పరికరాల కొనుగోలుకు తితిదే నుంచి రూ.3.50 కోట్ల నిధుల విడుదలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.



ఉమ్మడి చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

ఐటీఐ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌డీసీ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను మంగళవారం ఎన్నుకున్నారు. పద్మావతిపురంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా రాజు, ఉపాధ్యక్షుడుగా వరదాంజనేయులు, కార్యదర్శిగా సోమశేఖర్, సంయుక్త కార్యదర్శిగా ధనలక్ష్మి, కోశాధికారిగా రవీంద్రరెడ్డితో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

మత్స్యకారుల నూతన కార్యవర్గం



మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మను కలిసిన మత్స్యకారుల సంఘం నాయకులు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా జాతీయ మత్స్యకారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఆదిమూలం గిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం తిరుపతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మహిళా అధ్యక్షురాలిగా ఎస్.లక్ష్మీదేవిని ఎన్నుకున్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆదిమూలం దుర్గ భవాని, కార్యనిర్వాహక సభ్యులుగా పాతగుంట భక్తవత్సలం ఎన్నికయ్యారు. మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ, సంఘం రాష్ట్ర అధ్యక్షులు అప్పలరాజు, ఉపాధ్యక్షులు ఏకాక్షరి, అరవింద్, రాష్ట్ర సలహాదారులు, బాపట్ల జిల్లా అధ్యక్షులు రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ బెస్త, మత్స్యకారుల కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘాట్‌రోడ్డు రక్షణ గోడను ఢీకొన్న వ్యాన్

తిరుమల, న్యూస్‌టుడే: మొదటి ఘాట్‌రోడ్డులో టెంపో ట్రావెలర్ వ్యాన్ ప్రమాదానికి గురైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. తమిళనాడు రాష్ట్రం తిరుచ్చికి చెందిన లోకనాథం 12 మంది కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 12న తిరుపతికి వచ్చారు. వెంకటేష్ అనే డ్రైవర్‌తో ఉన్న పరిచయంతో టెంపో ట్రావెలర్ వ్యాన్‌ను మాట్లాడుకుని ఇక్కడి తిరుమలకు చేరుకున్నారు. దర్శనానంతరం మంగళవారం ఉదయం తిరుమల నుంచి తిరుపతికి వస్తుండగా ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్‌కావడంతో వాహనం రక్షణ గోడను ఢీకొంది. డ్రైవర్ వెంకటేష్ తలకు తీవ్రగాయాలు కాగా, నలుగురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. రాకపోకలను పునరుద్ధరించారు.



ప్రమాదానికి గురైన వ్యాన్ సమీపంలోనే గాయపడిన డ్రైవర్ వద్ద భక్తులు

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

తాగునీటి సమస్య పరిష్కారం

పాకాల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. తాగునీరు లేక ట్యాంకర్లతో అవస్థలు పడుతున్న విషయాన్ని ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి స్థానిక నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వారు ఎమ్మెల్యే నాని దృష్టికి తేవడంతో ఆయన చొరవతో ఇరంగారిపల్లి పంచాయతీ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దీంతో ఆమె స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, వైకాపా మాజీ మంత్రి కొడాలి నాని దర్శించుకున్నారు.

సంగీత విభావరికి అనుమతించాలి

తిరుపతి (బైరాగిపట్టెడ): ఎస్వీయూలోని తారకరామా మైదానంలో ఈనెల 26వ తేదీన నిర్వహించే సంగీత విభావరికి వర్సిటీ విద్యార్థులను అనుమతించాలని కోరుతూ మంగళవారం వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులకు వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విన్నవించారు.

న్యూస్‌టుడే, తిరుపతి(నగరపాలిక), చంద్రగిరి

సమస్య: కె.టి.రోడ్డులోని రామచంద్ర నగర్ మొదటి క్రాస్‌లోని మురుగునీటి కాలువ నుంచి మురుగునీరు బయటకు వస్తున్నాయి. రోడ్డుమట్టిమయంగా మారింది.
– బాలసుబ్రహ్మణ్యం, రామచంద్ర నగర్

సమాధానం: మురుగు కాలువ సమస్యను పరిష్కరిస్తాం.
– డాక్టర్ యువ అన్వేష్, నగరపాలిక వైద్యాధికారి

సమస్య: సత్యనారాయణపురంలోని ఇంటి నెంబర్ 21-8-115బి ఉన్న వీధిలో అనధికారిక వాహన పార్కింగ్ చాలా సమస్యగా ఉంది. నిత్యం గొడవలు అవుతున్నాయి.
– స్థానికులు, సత్యనారాయణపురం

సమాధానం: ప్లానింగ్ కార్యదర్శి పరిశీలన అనంతరం సమస్యను పరిష్కరిస్తాం. – అమరయ్య, ఉప కమిషనర్

సమస్య: నూకలగుంటకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే విద్యుత్తు నియంత్రిక ఉంది. భద్రతా ఏర్పాట్లు చేపట్టలేదు.
– రమేష్, స్థానికుడు

సమాధానం: రెండు రోజుల్లో ఇనుప కంచె ఏర్పాటు చేస్తాం. – నాగరాజ, ఏఈ, చంద్రగిరి



ఆటోనగర్ వద్ద రహదారిలో భారీగా నిలిచిన నీరు



గోవిందరాజ స్వామి ఆలయం వద్ద వర్షపునీటిలో భక్తుల రాకపోకలు

రోజంతా.. జోరువాన

తిరుపతి (నగరపాలిక, మహిళావర్సిటీ, బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే : అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఏకధాటిగా వర్షం కురిసింది. నగరంలో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి.. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. రహదారులపై నీళ్లు చేరి వాహన చోదకులు, శ్రీవారి భక్తులు ఇబ్బందులుపడుతున్నారు. ఇదే పరిస్థితి తుమ్మలగుంట వద్ద రామసేతు వంతెన కింద నెలకొంది.

● వర్షాలకు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో పలు భారీ వృక్షాలు నేలకూలాయి. హ్యూమానిటీస్ బ్లాకు ముందున్న చింత చెట్టు నేల కూలడంతో సిబ్బంది ఉలిక్కిపడ్డారు. ఆ సమయంలో విద్యార్థినులు, సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వర్షాలకు ఎస్వీయూలోని రోడ్లు దెబ్బతిన్నాయి. మట్టి, బురద పేరుకుపోయి విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

శ్రీవారి భక్తులకు కష్టాలు

వర్షాలతో శ్రీవారి భక్తులకు కష్టాలు తప్పడం లేదు. దసరా రద్దీ తగ్గినా పెరటాసి మాసం ముగింపు వేళ తమిళనాడు ప్రాంతానికి చెందిన భక్తులు ఎక్కువగా నడక మార్గంలో, మరికొందరు ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు చేరుకుంటున్నారు. తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణునివాసం వద్ద వర్షపు నీరు ఆగడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వసతి గదులు దొరకనివారు డార్మిటరీల్లోనే సేదతీరాల్సి వస్తోంది. వేళకు ఆహార పదార్థాలు దొరకక అవస్థలు పడుతున్నారు. గోవిందరాజస్వామి ఆలయం వద్ద వర్షపు నీరు ఏరులై పారుతోంది. అలిపిరి నడక మార్గంలో మెట్లపై వర్షంనీరు పారుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, తితిదే వసతి సత్రాల్లో ఆహార పదార్థాలు, తాగునీరు, చిన్నపిల్లలకు పాలు అందించాలని భక్తులు వేడుకుంటున్నారు.

ఉద్ధృతంగా తలకోన జలపాతం

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: వర్షాలతో తలకోన జలపాతం ఉద్ధృతం ప్రవహిస్తోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పర్యాటకుల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. ప్రత్యేక పోలీసు బృందంతో పికెటింగ్ ఏర్పాటు చేశారు. శ్రీసిద్ధేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి మాత్రమే అనుమతిస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో ప్రజలు సమాచారం అందించాలని తహసీల్దారు రూప్‌చంద్ కోరారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో టమోట రైతులు నష్టపోయారు. ● **చంద్రగిరి:** తహసీల్దారు శివరాంసుబ్బయ్య మండల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమస్యలు ఉంటే కంట్రోల్ కేంద్రం 72070 08187తో పాటు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు, యర్రావారిపాళెం మండలాల అధికారులతో సమావేశమయ్యారు. అన్ని గ్రామాల రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు చెరువులు, వాగులు, వంకలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. తహసీల్దార్లు జనార్దనరాజు, రూప్‌చంద్, ఎంపీడీవోలు గిడ్డయ్య, అరుణ, డీటీ వాసుదేవ కుమార్, యర్రావారిపాళెం ఎస్సై ఎర్రిస్వామి పాల్గొన్నారు.

నగరంలో 17 పునరావాస కేంద్రాలు

– కమిషనర్ ఎన్.మౌర్య



తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: నగరంలో లోతట్టు ప్రాంతాలను గుర్తించి అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. వర్షాల నేపథ్యంలో ముందస్తు, సహాయ చర్యలపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. నగరంలో వర్షపు నీరు ఆగకుండా సాఫీగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని వివరించారు. పేరూరు, ఎస్వీయూ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపునీరు.. మాల్వాడి గుండం, కపిలతీర్థం కాలువలతో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించామన్నారు. పునరావాసం కోసం నగరంలో 17 ప్రాంతాలను గుర్తించామని, మంగళవారం రాత్రికి ఏర్పాట్లు పూర్తవుతాయని, 30 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం సైతం అందుబాటులో ఉందని ఆమె వెల్లడించారు. నగరవ్యాప్తంగా కాలువలపై అక్రమ నిర్మాణాలు ఎక్కువగా ఉండటంతో ఇళ్లలోకి నీళ్లు చొరబడుతున్నాయని, రాజకీయ నేతల సహకారంతో ప్రభుత్వం దృష్టికి అక్రమ నిర్మాణాల సమస్యను తీసుకెళ్లి వాటి తొలగింపునకు చర్యలు చేపడతామన్నారు. రోగాలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, శుభ్రమైన నీటిని అందించేందుకు నీటిసాంద్రత పరీక్షలు నిర్వహించిన అనంతరం సరఫరా చేస్తున్నట్లు ఎన్.మౌర్య తెలిపారు.

●కాలువలు పొంగినా, వర్షాలతో ఇబ్బందులు ఎదురైనా నగరపాలిక హెల్ప్‌లైన్ 0877- 2256766కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆరు కుటుంబాల తరలింపు

రామచంద్రాపురం: ఆర్ఐ కృష్ణమ్మ తమ సిబ్బందితో కలసి సి.రామాపురం అరుణ కాలనీ, కమ్మపల్లి పంచాయతీ సిద్దేశ్వర యానాది కాలనీని సందర్శించారు. కమ్మపల్లి సిద్దేశ్వర యానాది కాలనీలో ఆరు కుటుంబాలు కాలువకు సమీపంలో ఉండటంతో ముందు జాగ్రత్తగా వారిని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు.



కేంద్రంలో ఆశ్రయం పొందుతూ..

వియత్నాం సదస్సుకు ఎంపిక

తిరుపతి (బైరాగిపట్టెడ): వియత్నాంలో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ ఎడ్యుకేషన్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్నట్లు ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. 'పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి జానపద కళలు' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పిస్తున్నట్లు వెల్లడించారు.

జిల్లా ఇన్‌ఛార్జి డీపీటీవోగా జగదీష్



చెంగల్‌రెడ్డిని సత్కరిస్తున్న ఇన్‌ఛార్జి డీపీటీవో జగదీష్, డిపో మేనేజర్లు, ఇతర అధికారులు

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: ఆర్టీసీ ఇన్‌ఛార్జి జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో)గా చిత్తూరు జిల్లా డీపీటీవో జగదీష్ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఉన్న తిమ్మాడి చెంగల్ రెడ్డి పదోన్నతిపై ఈడీ (ఇంజినీరింగ్)గా విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలను సమష్టి కృషితో విజయవంతం చేయడం ఆనందంగా ఉందని చెంగల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆయన సన్మాన కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ సీటీఎం భాస్కర్, డిప్యూటీ సీఎంఈ నరసింహులు, పీవో షాహజాద్, తిరుపతి ఏటీఎం డి.రామచంద్ర నాయుడు, జిల్లాలోని డిపో మేనేజర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రోగులకు ఉచిత భోజనం

చంద్రగిరి, న్యూస్‌టుడే: సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు పొందుతున్న రోగులకు బుధవారం నుంచి ఉచిత భోజన వసతి కల్పించడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆసుపత్రిలో చికిత్సల నిమిత్తం వచ్చిన రోగులకు ఉచిత భోజన వసతి కేంద్రాన్ని బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ డా.అరుణ తెలిపారు. చంద్రగిరి పట్టణంలోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోజూ సుమారు 300 మందికి రోగులు వస్తున్నారు. వీరిలో కొంతమంది చికిత్సల నిమిత్తం ఆసుపత్రిలో చేరుతున్నారు. వీరికి ప్రతిరోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఆసుపత్రి ఆవరణలోనే తయారుచేసి అందించేందుకు చర్యలు చేపట్టారు.

తిరుచానూరులో కాలినడక భక్తులకు అన్నదానం

తిరుచానూరు: తమిళనాడునుంచి తిరుమలకు కాలినడకన వస్తున్న భక్తులకు తిరుచానూరులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో మంగళవారం అన్నదానం చేశారు. ఏకవీర సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు ప్రతాప్‌స్వామిజీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భాజపా నాయకులు గుండాల గోపినాథ్, సుబ్రహ్మణ్యంరెడ్డి, చెంగారెడ్డి, వాసు, బ్రహ్మానందం, జేజీరెడ్డి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ప్రతాప్‌స్వామిజీ

మహిళా వర్సిటీ నుంచి డాక్టరేట్



హరిప్రియ

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీపద్మావతి మహిళా వర్సిటీ విద్యావిభాగం పరిశోధక విద్యార్థిని సి.హరిప్రియకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య సునీత బాయ్ మార్గదర్శకత్వంలో 'ఎ స్టడీ ఆఫ్ క్రిటికల్ థింకింగ్, ఎమోషనల్ ఇంటిలిజెన్స్ అండ్ దేర్ ఎఫెక్ట్ ఆన్ అకడమిక్ అచీవ్‌మెంట్ ఇన్ సైన్స్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్' అంశంపై పరిశోధన సమర్పించినందుకుగాను ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జీవనజ్యోతి తెలిపారు.

సందేహాల నివృత్తికి.. పొలం పిలుస్తోంది

రామచంద్రాపురం: రైతులు సందేహాలు నివృత్తి చేసుకునేందుకు పొలం పిలుస్తోంది వేదిక దోహదపడుతుందని ఏవో స్రవంతి, తెదేపా మండల మాజీ ఉపాధ్యక్షులు మహేష్‌నాయుడు అన్నారు. మంగళవారం మిట్టకండ్రిగ, రాయలచెరువులో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీఆర్పీలు, సిబ్బంది బీజామృతం, జీవామృతాలను తయారు చేసి, వాటి ప్రయోజనాలను వివరించారు.

ప్రథమ చికిత్స కిట్ల పంపిణీ

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు నగరంలోని ప్రముఖ ఆసుపత్రి యాజమాన్యం మంగళవారం 250 ప్రథమ చికిత్స కిట్లను అందజేసింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరై వాటిని అందజేశారు. వాకర్ల సంఘం నాయకుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విద్యార్థులకు ఆదర్శం అబ్దుల్ కలాం

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రేరణ కల్పించిన మహనీయుడు, ఆదర్శప్రాయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని భాజపా సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ గుండాల గోపినాథ్ రెడ్డి పేర్కొన్నారు. కలాం జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, రవి, మునిరత్నం, చెంగారెడ్డి, రెడ్డప్ప నాయుడు, మురళి పాల్గొన్నారు.



కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: జాతీయ స్థాయి 1వ పార్షల్ బ్లైండ్(అంధుల) ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు అంధుల క్రీడల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేషగిరి పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకు గుజరాత్ వేదికగా జరగనున్న పోటీలకు ఎంపికైన రాష్ట్ర జట్టుకు మంగళవారం తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో క్రీడా పరికరాలు అందజేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచల నరసయ్య నాయుడు, సభ్యులు వినయ్‌కుమార్, రంగినేని రాజు, జట్టు శిక్షకుడు వినోద్ పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణతో లోపాలు సరిదిద్దవచ్చు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: అభ్యసనకు సంబంధించి విద్యార్థుల్లో ఉన్న లోపాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని ఎంఆర్‌పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుభాషిణి పేర్కొన్నారు. మంగళవారం సమగ్ర శిక్షా, సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో డిస్‌లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సహిత విద్య ఉపాధ్యాయినులు ఉషారాణి, సుప్రజ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిఘా నేత్రాలతో నేరాల కట్టడి

తిరుపతి(నేరవిభాగం): మానవ అక్రమ రవాణా నిర్మూలన నిఘా నేత్రాలతోనే సాధ్యమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ద మూమెంట్ ఇండియా, గ్రామ జ్యోతి సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన నిర్వహించే 'వాక్ ఫర్ ఫ్రీడమ్'కి సంబంధించిన ప్రచార పత్రాలు, టీ షర్టులను ఎస్పీ మంగళవారం ఆవిష్కరించారు. పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు అమరనాథ్, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ కార్యదర్శి దొరస్వామి, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.



ప్రచార పత్రం ఆవిష్కరిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమలలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

తిరుమల, న్యూస్‌టుడే: స్థానిక బాలాజీ బస్టాండ్‌లో గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వెంకటమ్మ(80) అనే మహిళ అపస్మారక స్థితిలో ఉండటంతో స్థానికులు తితిదే అశ్విని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రుయా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతదేహాన్ని ఎస్వీ వైద్యకళాశాల శవపరీక్షల కేంద్రానికి తరలించారు. కేసు నమోదుచేసిన పోలీసులు మృతురాలి ఆచూకీ కోసం యత్నించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే తిరుమల టూటౌన్ పీఎస్ నెం.0877-2289031ను సంప్రదించాలని కోరారు.

చోరీ చేసిన ఫోన్లు కొన్న దుకాణదారుల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: దొంగతనం చేసిన వారి నుంచి సెల్‌ఫోన్లు కొనుగోలు చేసిన ముగ్గురు దుకాణ యజమానులు.. మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం తూర్పు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. భగత్‌సింగ్ కాలనీకి చెందిన శ్రీనివాసులురెడ్డి సెల్‌ఫోన్ చోరీపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టగా ఆ ఫోను ఓ మొబైల్ దుకాణంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. విచారించగా నగరంలో చోరీకి జరుగుతున్న మొబైల్ ఫోన్లను దుకాణదారులు కొనుగోలు చేస్తున్నారని తెలిసిందన్నారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన మల్లికార్జున (36) చోరీ చేసిన వాటిని కొర్లగుంటలోని ముకేష్ మొబైల్స్ యజమాని తాండవ ముకేష్ (24), శక్తి సెల్‌కేర్ యజమాని రాపూరి అమర్నాథ్ రెడ్డి (49), మహిత మొబైల్ యజమాని కుంచపు శ్రీనాథ్ (28)తోపాటు మొబైల్ మెకానిక్ బి.జగదీష్ (24)కు విక్రయిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేసి 32 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలు

తిరుపతి (లీగల్): చెక్ బౌన్సు కేసులో ఓవిద్యాసంస్థల అధినేతకి ఏడాది జైలుశిక్ష, రూ.14 లక్షలు పరిహారం కింద చెల్లించాల్సిందిగా ఒకటో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సీకేవీ సత్యకాంత్ కుమార్ మంగళవారం తీర్పు వెలువరించినట్లు ఫిర్యాది తరఫు న్యాయవాది కోటకొండ రెడ్డెప్ప తెలిపారు. రేణిగుంట మండలం ఎలమండ్యం గ్రామంలోని యోగానంద విద్యాసంస్థల ఛైర్మన్ డి.మోహన్‌రెడ్డి.. రేణిగుంట మండలం కొత్తపాళ్యంకి చెందిన ఆర్.వెంకట సుబ్బారెడ్డి వద్ద 2016లో అప్పుచేశారు. దాన్ని తీర్చడానికి 2018లో రూ.14 లక్షల విలువగల మూడు చెక్కులు జారీచేశారు. బౌన్సు కావటంతో ఫిర్యాది తిరుపతి కోర్టులో కేసు దాఖలు చేయగా కేసు సాక్ష్యాధారాలతో నిరూపితమైంది.

అభ్యసన వైకల్యంపై అవగాహన ర్యాలీ



చంద్రగిరిలో విద్యార్థుల ర్యాలీ

చంద్రగిరి, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని అభ్యసన వైకల్యాలను ప్రత్యేక శిక్షణ తరగతుల ద్వారా సరిదిద్దవచ్చని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి అన్నారు. చంద్రగిరి పట్టణంలో మంగళవారం నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై విద్యార్థులతో కలిసి అవగాహన ప్రదర్శన నిర్వహించారు. చదువులో కొందరు విద్యార్థులు వెనకబడి ఉంటారని అటువంటి వారిలో ఐదు రకాల వైకల్యాలు ఉంటాయన్నారు. ప్రత్యేక విద్యాబోధన ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్, భవితకేంద్రం ఉపాధ్యాయులు శ్యామలాదేవి, వెంకటరాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

రామచంద్రాపురం: నిర్దిష్ట అభ్యసన వైకల్య విద్యార్థులను ప్రాథమిక దశలోనే గుర్తించి వారిపట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిని సారించాలని ఎంఈవో మార్కొండయ్యానాయుడు అన్నారు. మంగళవారం నిర్దిష్ట అభ్యసన వైకల్య జాగృతి వారోత్సవాల్లో భాగంగా భవిత కేంద్రం ఉపాధ్యాయులు, కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వాగ్దేవి, ప్రత్యేక ఉపాధ్యాయులు లీలారాణి, విద్యార్థులు అవగాహన ర్యాలీని నిర్వహించారు.



రోడ్డు ఆక్రమించి.. ప్రహరీ నిర్మించి

తిరుపతి పరిధిలో భూముల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. రోడ్లను సైతం ఆక్రమించుకుని హద్దులు మార్చేసుకుంటున్నారు. మంగళం పరిధిలోని వేంకటేశ్వరకాలనీ సమీపంలో కరకంబాడి మార్గానికి అనుకుని ఫుట్‌పాత్ కోసం వదలిపెట్టిన ఆర్‌అండ్‌బీకి చెందిన భూమిని పక్కనే ఉన్న ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుని ప్రహరీ నిర్మించేశారు. ఆక్రమిత భూమి 30 అంకణాలకుపైగా ఉంటుంది. ఇక్కడ అంకణం రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ధర పలుకుతోంది. ప్రహరీ నిర్మించి నాలుగు రోజులవుతున్నా ర.భ.శాఖ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు.

– న్యూస్‌టుడే, తిరుపతి (మంగళం)

శ్రీకాళహస్తి
• శ్రీకాళహస్తి • సత్యవేడు



ఉత్సవర్ల ఊరేగింపు

ఘనంగా ప్రదోష నందిసేవ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రదోష నందిసేవ మహోత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉత్సవర్లయిన శ్రీఉమాదేవి సమేత చంద్రశేఖర స్వామిలకు విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం చిన్న నందీశ్వరునిపై ఆలయంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.



శివాలయాల్లో పూజలు

నాగలాపురం, న్యూస్‌టుడే: సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయం, నాగలాపురంలోని నాగలింగేశ్వరాలయాల్లో ప్రదోషపూజలను మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఆలయంలోని మూలవర్లకు ఉదయం తైలాభిషేకం చేసిన అర్చకులు సాయంత్రం ప్రదోష నందీశ్వరులకు విశేషాభిషేకాల అనంతరం ముస్తాబు చేశారు. పల్లికొండేశ్వరాలయంలో ఉత్సవమూర్తులకు ప్రాకారోత్సవం నిర్వహించారు. తుపాను ప్రభావంతో ఆలయాల్లో భక్తుల తాకిడి గణనీయంగా తగ్గింది. ఏర్పాట్లను ఈవో లత, ధర్మకర్త గజేంద్రనాయుడులు పర్యవేక్షించారు.

ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు), న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని బీవీపురం పంచాయతీలో మంగళవారం 'పల్లెపండగ' వారోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.10లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇటీవలే అంచెలంచెలుగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎగువవీధి ఎస్సీకాలనీ, పెద్దమిట్టకండ్రిగ, చిన్నమిట్టకండ్రిగ, సుబ్బానాయుడుకండ్రిగ, ఆబ్బాబుపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరాన్ రవిశాంక్, తెదేపా మండల అధ్యక్షులు కామేష్‌యాదవ్, ఈశ్వర్‌రెడ్డి, పాపిరెడ్డి, చెంచయ్యనాయుడు, రవీంద్రనాథ్‌రెడ్డి, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

శికారీ కాలనీ పరిశీలన

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించనున్న రైల్వే బైపాస్ లైన్‌తో కనుమరుగు కానున్న శికారీ కాలనీని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. మంగళవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తాము ఇక్కడ కాపురాలు ఉంటున్నామని, పక్కనే రైల్వేస్టేషన్ ఉండటంతో పూసలమ్ముకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఇక్కడి ఖాళీ చేసేదుకు తాము సిద్ధంగా లేమన్నారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన స్థలానికి ప్రజా అవసరాలకు ప్రభుత్వం తిరిగి తీసుకుంటుందని బాధితులకు మంచి ప్రదేశంలో ఇంటి స్థలాలు కేటాయించి కాలనీ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ శ్యాంప్రసాద్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణంతో అవస్థలు పడుతున్నాం



ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మద్యం దుకాణం కారణంగా ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నామని బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవా సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మంగళవారం బంగారమ్మ కాలనీలోని నాగాలమ్మ ఆలయం వద్ద మద్యం దుకాణం వద్దని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి విన్నవించారు. ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. మద్యం దుకాణాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్షం.. అంతటా అప్రమత్తం

శ్రీకాళహస్తి, వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వాయుగుండంగా మారింది. దీంతో రెండ్రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. తుపాను మరింత బలపడటంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో అధికారులందరూ అప్రమత్తమయ్యారు. ప్రధానంగా తమిళనాడుకు సరిహద్దులోని శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలంటూ జిల్లా ఉన్నతాధికారులు సూచించారు.



పట్టణంలోని కన్నలి కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు

లోతట్టుపై ప్రత్యేక దృష్టి:

వాగులు, వంకలు పొంగి పొర్లే ప్రమాదం ఉండటంతో వాటికి దగ్గరలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు వీలుగా అలాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా శ్రీకాళహస్తిలోని కన్నలి కాల్వ, చెంబేడు కాల్వలకు సమీపంలో నివాసముంటున్న వాళ్లతో పాటు లంకమిట్ట కాలనీ గిరిజనులను అప్రమత్తం చేశారు. సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని పులిబొంద కాల్వ, మారేడు కాల్వ, పాము కాడు కాల్వలకు తీరంలో గ్రామాలను అధికారులు అప్రమత్తం చేశారు. కాల్వ గుండా ప్రవాహ ఉద్ధృతి పెరగడంవల్ల ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

వ్యర్థాలు వేయవద్దు

వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లోని కాల్వల్లో వ్యర్థాలను వేయవద్దంటూ పురపాలక సంఘ అధికారులు కోరుతున్నారు. వైకాపా హయాంలో అభివృద్ధిని విస్మరించిన కన్నలికాల్వలో మాత్రం ప్లాస్టిక్ వ్యర్థాలు అక్కడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పాలిథిన్ వ్యర్థాలు కాల్వల్లో కొట్టుకుపోయే పరిస్థితి ఉండదని, దీంతో వర్షపు నీళ్లన్నీ రోడ్లపైకి వచ్చే అవకాశముందని కమిషనర్ గిరికుమార్ ఆయా వీధుల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వర్షాలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కమిషనర్ తెలిపారు.

బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం కారణంగా ఈ నెల 13 నుంచి 15వ తేదీ రాత్రి 6 గంటల వరకు ఆయా మండలాల్లో కురిసిన వర్షపాతం వివరాలు.. మి.మీ.లలో

మండలం	వర్షపాతం
శ్రీకాళహస్తి	97.3
ఏర్పేడు	100.8
తొట్టంబేడు	75.9
రేణిగుంట	58.6
సత్యవేడు	87.6
వరదయ్యపాళెం	112.2
నాగలాపురం	56.3
నారాయణవనం	74.8
పిచ్చాటూరు	77.2
కేవీబీపురం	96.5
బీఎన్‌కండ్రిగ	114.4

చెరువులకు జలకళ

ఇన్నాళ్లపాటు నీళ్లు లేకుండా ఖాళీగా కన్పిస్తున్న చెరువుల్లోకి వర్షపు నీరు చేరుతున్నాయి. దీంతో కొంత మేర జలకళ సంతరించుకుంది. వరదయ్యపాళెం సమీపంలోని బొందకాల్వకు గండి పడి అయిదేళ్లు అవుతోంది. గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోనిపోగా ప్రస్తుతం అక్కడి ప్రజలు ఆందోళనలకు గురవుతున్నారు. సంతవేలూరు చెరువు కట్ట పటిష్టత బలహీనంగా ఉండటంపట్ల అక్కడి ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారాయణవనం వద్ద తిరువట్యం గ్రామస్థులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఆందోళనలకు గురవుతున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గతంలో కాల్వలు, చెరువులకు గండ్లు పడిన ప్రాంతాల్లో రైతులను జలవనరుల శాఖ అప్రమత్తం చేసింది.

వర్షాలపై విస్తృత చైతన్యం

వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు అధికారగణం ఏర్పాట్లు సిద్ధం చేసింది. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి కంట్రోలు రూము ద్వారా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటున్నారు. సమస్యలున్న ప్రాంతాల్లో అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ పరిష్కరించే దిశగా సన్నాహాలు సిద్ధం చేశారు. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు సచివాలయ కార్యదర్శుల ద్వారా సమాచారాన్ని తెలుసుకోవడంతో పాటు అవసరమైన ప్రాంతాలకు ఉద్యోగులను పంపి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, కేవీబీపురం

సమస్య: మండలంలోని కేసీకండ్రిగలో విద్యుత్ లేని సమయంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న చేతిపంపులో చిలుము నీరు వస్తుంది. సమస్యను పరిష్కరించాలి. - **రంగనాథం, స్థానికుడు**

సమాధానం: సమస్య ఉన్నమాట వాస్తవమే. రెండు రోజుల్లో గ్రామంలో నూతనంగా బోరు నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.
- **బాలాజీ, పంచాయతీ కార్యదర్శి, పాతపాళ్లెం**

న్యూస్‌టుడే, బీఎన్‌కండ్రిగ

సమస్య: మండలంలోని శ్రీకాళహస్తి-తడ రహదారి స్థానిక చెక్‌పోస్టు వద్ద వర్షపునీరు నిలిచి రహదారి మరమ్మతులకు గురవుతోంది. రహదారి తరచూ ధ్వంసమవుతోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - **రమేష్, స్థానికుడు**

సమాధానం: రహదారిపై నీరు తొలగించి నిల్వ చేరకుండా చూస్తాం. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటాం. - **రాజశేఖర్, ఈవోపీఆర్డీ**

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట పంచాయతీలోని అన్నదానసత్రం వీధిలో వీధి దీపాలు వెలగడంలేదని ఈనాడులో 'మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ సిబ్బంది వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

ఆటోస్టాండ్ శుభ్రం

సత్యవేడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తపాలా కార్యాలయ సమీప ఆటోస్టాంట్ వద్ద దుకాణాల చెత్తను పంచాయతీ సిబ్బంది మంగళవారం శుభ్రం చేశారు. ఈనాడులో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో 15వ తేదీన ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్ సిబ్బందితో చర్యలు చేపట్టారు.

పిచ్చిమొక్కల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన మార్గం నుంచి రాయపేడుకు చేరుకునే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను సర్పంచి బాలాజీ జేసీబీ సాయంతో తొలిగించారు. పిచ్చిమొక్కలతో ఇబ్బందులు శీర్షికన ఈనెల ఆరో తేదీన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్థానికులకు ఉపశమనం కల్పించారు.

అదుపు తప్పితే.. ఆసుపత్రికే



బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పూడి గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురై గండి పడింది. దీంతో ఈ రోడ్డు మీదగా ప్రయాణం సాగించే పూడి, పెన్నలపాడు గ్రామస్తులకు ప్రమాదం పొంచి ఉంది. రోడ్డుకు ఇరువైపులా అంచువరకు 10 అడుగుల మేర మట్టిని విక్రయించుకోవడంతో పలు చోట్ల కోతకు గురౌతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకోకముందే ర.భ.శాఖ అధికారులు స్పందించి గండిని పూడ్చాలని ప్రయాణికులు విజ్ఞప్తిచేస్తున్నారు.

- న్యూస్‌టుడే, తొట్టంబేడు

చెట్టు పడితే అంతే సంగతి



పట్టణంలోని నెహ్రూవీధిలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి న్యాయస్థానంలో నడుస్తున్న రాణిపేట సత్రం గోడలు శిథిలావస్థకు చేరాయి. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇక్కడున్న చిన్నపాటి గోడ పడిపోయింది. పక్కన భారీ చెట్టు పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఇదే జరిగితే ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే నెహ్రూవీధిలో పడే ప్రమాదముంది. దీంతో ఎదైనా ఊహించని అనర్థాలు తలెత్తే అవకాశముంది. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రమాదకరంగా ఉన్న చెట్టును తొలగించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి



చెరువుకట్ట మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అధికారులు

చెరువు కట్టల పటిష్టతపై ప్రత్యేక శ్రద్ధ

బీఎన్‌కండ్రిగ : భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లోని చెరువుల పటిష్టతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తహసీల్దారు సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఆయన ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎస్సై విశ్వనాథనాయుడుతో కలిసి గాజులపెళ్లూరు చెరువుకట్ట మరమ్మతు పనులను పరిశీలించారు. గతంలో చెరువుకట్ట కోతకు గురై ఉండడంతో ఆ ప్రదేశంలో మట్టి, ఇసుక బస్తాలు వేసి బలోపేతం చేస్తున్నామన్నారు. విద్యుత్ సమస్యలపై సత్వర సేవలందిస్తామని ట్రాన్స్‌కో ఏఈ చలపతి తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య, సుందరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్లు.. వర్షానికి పాట్లు

శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనానికి తిరుమంజన గోపురం గుండా వెళ్లే భక్తులు అక్కడ అమర్చిన చెక్క మెట్లతో అవస్థలు పడుతున్నారు. వర్షానికి చెక్కలు జారుతున్నాయి. అంతేకాకుండా ఓ వైపున చెక్కలు లేచి పోవడం, అడుగుపెడితే జారిపోయే విధంగా ఉండటంతో అటు వైపుగా దర్శనార్థం వెళ్లే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. యాత్రికులకు ఇబ్బందులు తప్పించే విధంగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి





సీసీరోడ్డు నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న కోనేటి ఆదిమూలం

గ్రామాల అభివృద్ధికి పల్లె పండగ

నారాయణవనం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కూటమి ప్రభుత్వం పల్లె పండగ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం ఆయన నారాయణవనంలో పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొని సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్, మాజీ ఎంపీపీ గోవిందస్వామి, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, ఎంపీడీవో గుణశేఖర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం అడుగు జాడల్లో నడుద్దాం

శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు), న్యూస్‌టుడే: యువత ఏపీజే అబ్దుల్ కలాం అడుగు జాడల్లో నడుస్తూ దేశాభివృద్ధికి కృషి చేయాలని స్కిమ్స్ ఎంబీఏ, ఎంసీఏ కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి తెలిపారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని మంగళవారం కళాశాలలో చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. కలాం సేవలను స్మరించుకుని నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గీతాదేవి, శ్రీకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరాలయ మహాకుంభాభిషేకం



వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని కువ్వాకుళ్లి పంచాయతీ లక్ష్మీపురం(కే)లో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరాలయ మహాకుంభాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం గణపతి పూజ అనంతరం లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ శాంతి హోమం, పూర్ణాహుతి వంటి పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు. ముఖ్యఅతిథిగా వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించే వరకు అనుమతించం

నింద్ర, న్యూస్‌టుడే: నింద్ర మండల పరిధిలోని నేటమ్స్ షుగర్స్‌కి గతంలో అప్పు ఇచ్చిన ముంబయికి చెందిన ఎస్‌టీసీసీఐ కంపెనీ ప్రతినిధులు ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోడానికి ఇటీవల యాక్షన్ నోటీసు ఇచ్చారు. దీంతో స్థానిక రైతులకు రూ.37కోట్లు, కార్మికులకు సుమారు రూ.10 కోట్ల మేర యాజమాన్యం చెల్లించాల్సి ఉందని.. చెల్లించే వరకు ఫ్యాక్టరీలోకి ఎవరినీ అనుమతించమని మంగళవారం ఫ్యాక్టరీ ఆవరణలో రైతులు, కార్మికులు ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీలో ఎస్టీసీఐ ఫినాన్స్ కంపెనీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సెక్యూరిటీ సిబ్బందిని సైతం బయటకు పంపించారు. సిబ్బంది కంపెనీ ప్రతినిధులకు సమాచారం చేరవేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌టీసీఐ కంపెనీ తరఫున వేసిన యాక్షన్ నోటీసును ప్రస్తుతానికి వాయిదా వేసినట్లు ఆ సంస్థ డీజీఎం బబిత రైతు సంఘాల నాయకులకు తెలిపారు. ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు రైతులు, కార్మికులు ప్రకటించారు.

జూదరుల అరెస్టు

శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని పేకాట స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి జూదరులను అరెస్టు చేశారు. గ్రామీణం సీఐ రవినాయక్ కథనం మేరకు.. అమ్మచెరువు సమీపంలో దాడులు నిర్వహించి నలుగురు జూదరులను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి మూడు ద్విచక్రవాహనాలు, రూ.3వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



ఎడతెరపిలేని వర్షం.. స్తంభించిన జనజీవనం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: తుపాన్ నేపథ్యంలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు రహదారులు జలయమమైయ్యాయి. అధికార యంత్రాంగం సమస్యాత్మక గ్రామాలను సమీక్షిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే పలు గ్రామాలు జలదిగ్బంధం, ముంపునకు గురయ్యే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లలో సన్నద్ధమవుతున్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

ముక్కంటి సేవలో రాజశేఖర్ దంపతులు.. శ్రీకాళహస్తి: సినీనటులు రాజశేఖర్, సతీమణి జీవితలు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన వీరికి మంగళవారం ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. కాలభైరవుని అభిషేక సేవల్లో పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లకు భూమిపూజ.. సత్యవేడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మదనంబేడు, శిరణంబూదురు, కాదిరివేడు గ్రామాల్లో పలు సిమెంట్ రోడ్లకు తెదేపా నాయకులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, బాష, మాజీ ఎంపీటీసీ సభ్యులు అమాసరెడ్డి, శశి, బక్కయ్య, మణినాయుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ విస్తరణాధికారిగా తరుణాక్షరెడ్డి.. సత్యవేడు, న్యూస్‌టుడే: సత్యవేడు పంచాయతీరాజ్ విస్తరణాధికారిగా తరుణాక్షరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా తొట్టంబేడు ఈవోపీఆర్డీగా పని చేస్తున్న తరుణాక్షరెడ్డి ఇక్కడికి బదిలీ అయ్యారు.

ఆర్.అగ్రహారంలో పొలం పిలుస్తోంది.. రేణిగుంట, న్యూస్‌టుడే: వరి పంటలో అధిక వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్క రైతు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆర్.అగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు నియంత్రించాలి.. శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు), న్యూస్‌టుడే: కలసికట్టుగా మత్తు పదార్థాలను నియంత్రించాల్సిన అవసరం ఉందని శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి తెలిపారు. ఉపాధ్యాయ బృందంతో కలిసి మంగళవారం గ్రామంలోని దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సురేష్, శాంతి, మురళి, రమేష్ రెడ్డి, సుమతి, రజియా, శ్రీనివాసులు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు.. ఏర్పేడు, న్యూస్‌టుడే: ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. నిర్దిష్ట అభ్యసన వైకల్యాలపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్రీరాములు, స్వర్ణలత, రమాదేవి, లావణ్య, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నారాయణవనం:** నారాయణవనం ప్రధాన పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రం విద్యార్థులతో నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో ప్రభాకర్‌రాజు, ప్రధానోపాధ్యాయులు రోశిమందడి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు విజయన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం.. శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కూనాటి సురేష్ ఇటీవల జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడంతో రోటరీక్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. రోటరీక్లబ్ అధ్యక్షురాలు శైలజ ఆధ్వర్యంలో మంగళవారం సురేష్‌ను అభినందించి సేవలను కొనియాడారు. అనంతరం గత నెలలో జరిగిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వృద్ధాశ్రమానికి చక్రాల కుర్చీని వితరణగా అందజేశారు. మాధవన్, సిద్దులగారి ప్రసాద్, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఉప సర్పంచి, వార్డు సభ్యులే కీలకం.. రేణిగుంట, న్యూస్‌టుడే: పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచి, వార్డు సభ్యుల పాత్ర కీలకమని, అందుకే పలు అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవి తెలిపారు. గ్రామ పంచాయతీల పరిపాలన విధానంపై రెండు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ప్రారంభించారు. ఈవోపీఆర్‌డీ ప్రభురావు, మండల రిసోర్స్ సభ్యులు మని, భరత్ తదితరులు పాల్గొన్నారు. **బీఎన్‌కండ్రిగ:** పంచాయతీల అభివృద్ధిలో వార్డు సభ్యులు కీలకమని ఎంపీడీవో త్రివిక్రమరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపసర్పంచులు, పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు.

అద్దె ధరలతో సూచికలు.. శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ఆలయం తరఫున ఉన్న అతిథి గృహాలు, వాటిలోని గదుల సంఖ్య, అద్దె ధరలు, జీఎస్‌టీతో కలిపిన ధరలతో సూచిక బోర్డులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా సన్నిధి వీధిలో అక్కడి ప్రైవేటు లాడ్జీ నిర్వాహకులు కొందరు భక్తులను మోసాలకు గురిచేయడంపై ఫిర్యాదులు అందాయి. వీటికి చరమగీతం పాడే విధంగా ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఈ తరహా సూచికలను అందుబాటులోకి తీసుకువచ్చారు.



అధ్వానంగా వీధి



కాపలాలేని పోలీసు ఔట్ పోస్టు

సమస్యల నిలయం తారకరామానగర్

పట్టించుకోని అధికారులు

రేణిగుంట, న్యూస్‌టుడే: పేదల కోసం ఉమ్మడి రాష్ట్రంలో 2003లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన తారకరామానగర్‌లో నేటికీ సమస్యలు తాండవిస్తున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమౌతున్నాయి. పైగా ఇక్కడో నేర సామ్రాజ్యం ఏర్పడుతోంది. పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేసినా ఏనాడు పోలీసులు ఇక్కడికి వచ్చిందే లేదు.

కనీస సౌకర్యాల కరవు

రేణిగుంట మండలంలోని కరకంబాడి పంచాయతీలో 2003లో తారకరామానగర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ తిరుపతికి చెందిన పేదలకు మొదట ప్లాట్లు కేటాయించారు. అనంతరం రేణిగుంటకు చెందిన పేదలకు ఇచ్చారు. ఇలా మొత్తం సుమారు ఆరు వేల ప్లాట్లు ఏర్పాటయ్యాయి. అయితే నేటికీ ఇక్కడ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, నాయకులు విఫలమయ్యారు. ఒక ప్రధాన రోడ్డు, నగర్ మధ్యలో వాటర్‌ప్లాంటు మినహా మరో సౌకర్యం లేదు. ప్రధానంగా ఇక్కడ సుమారు 100 రోడ్లకు పైగా ఉన్నప్పటికీ ఒక్క రోడ్డుకు సరైన రూపం లేదు. రోడ్లన్నీ పిచ్చి మొక్కలు, బురదతో దర్శనమిస్తున్నాయి. మరో పక్క గతంలో కొన్ని ప్రదేశాల్లో కాలువలు నిర్మించినా ప్రస్తుతం అవి అధ్వానంగా మారాయి. ఆ కాలువలు ప్రజలు నివసించే ప్రాంతంలో లేక పోవడంతో ఇంటి బయటే తీసిన గుంతల్లోకి మురుగును వదులుకుంటున్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలిగిన దాఖలాలు లేవు.

నేరాలకు కేంద్రం

గడిచిన ఐదేళ్లలో ఈ నగర్ అనేక నేరాలకు కేంద్రబిందువైంది. గతంలో ఇక్కడ పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు తరువాత వైకాపా ప్రభుత్వంలో దానిని పక్కన పెట్టేశారు. ప్రస్తుతం ఈ కేంద్రం ఉన్నా ఏనాడు పోలీసులు వచ్చిన దాఖలాలు లేవు. పైగా బెల్టు షాపులు, భూ సమస్యలు, రౌడీ మూకల సమస్య తీవ్రమైంది. గ్రామంలోనే పంచాయతీలు పెట్టి రాజీ చేసుకుంటున్నారు.

త్వరలో అభివృద్ధి పనులు

తారకరామానగర్‌లో త్వరలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఇక్కడ నూతన డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- ఎంజీ రమేష్, పంచాయతీ కార్యదర్శి, కరకంబాడి

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట



గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 40 నుంచి రూ. 70 వరకు

రెండో రకం: కిలో రూ. 30 నుంచి రూ. 40 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	145
లేయర్	120
బ్రాయిలర్స్	258
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	284
లేయర్ మాంసం	204

బాలాయపల్లిలో 49.6 మిమీ వర్షం.. బాలాయపల్లి: మండలంలో మంగళవారం 49.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు సహాయ గణాంక అధికారి వసుంధర్ తెలిపారు. వర్షాలతో పలు గ్రామాల వీధులు జలమయంగా మారాయి. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడే అవకాశాలు దృష్ట్యా ప్రజలు అప్రమత్తతతో ఉండాలని అధికారులు సూచించారు.

తరగతులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు

కోట, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదేశాలను ఉల్లంఘించి కోటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మంగళవారం తరగతులు నిర్వహిస్తురనే ఫిర్యాదుతో తహసీల్దారు జయజయరావు, ఎంఈవో2 మస్తానయ్య తనిఖీలు చేశారు. వెంటనే విద్యార్థులను ఇళ్లకు పంపాలని పాఠశాల యాజమాన్యాన్ని అధికారులు ఆదేశించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. గూడూరు : 85002 02046 నాయుడుపేట: 80085 73970 సూళ్లూరుపేట: 96188 78782 వెంకటగిరి : 80085 73966 సమయం 10 AM TO 1 PM

కోట, న్యూస్‌టుడే:

సమస్య: కోట మండలం వీపీ అగ్రహారం రోడ్డు గుంతలమయమై అధ్వాన్నంగా ఉంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. **- సురేంద్ర, వాహనచోదకుడు**

సమాధానం: త్వరలోనే రోడ్డుకు మరమ్మతులు చేస్తాం. **- ర.భ అధికారి**

నాయుడుపేట పట్టణం

సమస్య: నాయుడుపేట అగ్రహారపేట వీధి ఆనుకుని ఉండే తూర్పురోడ్డు లోతట్టుగా మారింది. వర్షం, మురుగునీరు నిలుస్తోంది. **- శ్రీనివాసులు రెడ్డి, స్థానికుడు**

సమాధానం: ప్రతిపాదనలు సిద్ధం చేసి రోడ్డు వేస్తాం.

సమస్య: నాయుడుపేట శ్రీరామ్‌నగర్‌లో కల్వర్టు దెబ్బతిని ఇనుప చువ్వలు బయటపడి ప్రమాదకరంగా ఉన్నాయి. **- చంద్రయ్య, స్థానికుడు**

సమాధానం: కల్వర్టు మరమ్మతు పనులు చేస్తాం. **- ఫజులుల్లా, కమిషనర్, నాయుడుపేట**

– సూళ్లూరుపేట, న్యూస్‌టుడే

సమస్య: సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయం ముందు రైల్వే శాఖ పైపుల ఏర్పాటుకు గోతులు తీశారు. నేటికీ గోతులు పూడ్చకుండా వదిలేశారు. **- ఆలయ భక్తులు**

సమాధానం: రైల్వేశాఖ వారితో మాట్లాడి గోతులు పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. **- చిన్నయ్య, పుర కమిషనర్**

వెంకటగిరి, న్యూస్‌టుడే

సమస్య: పట్టణంలోని 9వ వార్డు ఉపాధ్యాయ నగర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ సమీపంలో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. ఈ వార్డు పరిధిలో సేకరించిన చెత్తను ఇక్కడే పడేస్తుండటంతో చెత్త వ్యర్థాలు గుట్టలను తలపిస్తున్నాయి. అధికారులు స్పందించి ఇక్కడ చెత్త నిల్వలు తొలగించాలి. **- భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి**

సమాధానం: పరిశీలించి చెత్త నిల్వలు వీలైనంత త్వరగా తొలగిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపడతాం. **- రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వెంకటగిరి**

బాలాయపల్లి, న్యూస్‌టుడే :

సమస్య: పెరిమిడి పంచాయతీ బొల్లవారిపాళెంలోని ప్రధాన వీధిలో చిన్న వర్షానికే వీధులు మడుగులను తలపిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. **- ప్రభాకర నాయుడు, బొల్లవారిపాళెం**

సమాధానం: ఉపాధి పథకం నిధులతో సిమెంటు రోడ్డుగా నిర్మించడానికి ప్రతిపాదనలు ఉన్నాయి. వీలైనంత త్వరలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం. **- డీజే వినీల్ కుమార్, ఎంపీడీవో, బాలాయపల్లి**

వాకాడు, న్యూస్‌టుడే

సమస్య: వాకాడు-దుగరాజపట్నం రోడ్డు మార్గంలో వావిళ్లపాలెం నుంచి దుగరాజపట్నం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చెట్లు కమ్ముకొని రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రి సమయంలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. **- రాధయ్య, దుగరాజపట్నం**

సమాధానం: చెట్లను తొలగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరలో చెట్లను తొలగిస్తాం. ఔ **- రామాంజనేయులు, ఈఈ రభ, గూడూరు**

సమస్య: దుగరాజపట్నం నుంచి కొండూరుపాలెం వెళ్లే మార్గం అధ్వాన్నంగా ఉంది. గుంతలు పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. **- గోవిందయ్య, కొండూరుపాలెం**

సమాధానం: వర్షాలు తగ్గిన తర్వాత గుంతలు పూడ్చుతాం. **- రామాంజనేయులు, ఈఈ, రభ, గూడూరు**

లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట ప్రాంతంలో మంగళవారం సాయంత్రం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. తహసీల్దార్ నరసింహారావు, కమిషనర్ చిన్నయ్య, తెదేపా నేతలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న షార్ మాజీ డైరెక్టర్ నారాయణ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మంగళవారం సూళ్లూరుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని ఆయన విగ్రహానికి షార్ మాజీ డైరెక్టర్ కాటూరి నారాయణ పుష్పాంజలి ఘటించారు. షార్‌లో ఆయనతో కలిసి పనిచేసిన పాత జ్ఞాపకాలను ఆయన గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఉస్మాన్‌బాషా, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, వీరయ్య, ఐతా శ్రీధర్, హరినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం.. ఇబ్బందుల్లో జనం



తడ: మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వివిధ ప్రాంతాల రహదారుల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.



వాకాడు: మండలంలో వర్షాలతో వీధులన్నీ జలమయంగా మారాయి. విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



నాయుడుపేట: నాయుడుపేట పరిసర ప్రాంతాలకు వెళ్లే రహదారులు దెబ్బతింటున్నాయి. నాయుడుపేట-శ్రీకాళహస్తి రోడ్డులో మంగళవారం ఆర్టీసీ బస్సు ఇలా వర్షపు నీటిలో ముందుకు సాగుతోంది.



సూళ్లూరుపేట: శ్రీహరికోట రోడ్డులో బాలికల గురుకులం వద్ద వర్షపు నీరు చెరువును తలపించింది. షార్ యాజమాన్యం ముందస్తు జాగ్రత్తలు పాటించారు. జీఎన్‌టీ రోడ్డులో నీరు నిలిచిపోవడంతో కమిషనర్ చిన్నయ్య నీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు.



సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణోత్సవం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆత్మామాలిక్ ధ్యాన మందిరంలో మంగళవారం రాత్రి సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవీవల్లిసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి వేద మంత్రాల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు.

చెంచులక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలి

వెంకటగిరి, డక్కిలి: భర్తను కిడ్నాప్ చేశారనే మనస్తాపంతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చెంచులక్ష్మి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. డక్కిలి మండలం దందోలు ఎస్సీ కాలనీలో మంగళవారం చెంచులక్ష్మి కుటుంబాన్ని పరామర్శించారు. భర్త రవిని అడిగి వివరాలు సేకరించారు.

రబీ సాగుకు సన్నద్ధం

☛ దుక్కులు చేస్తున్న అన్నదాతలు ☛ ఆలస్యమైనా ముందుకు



కొత్తూరు వరి పొలాల్లో నీరు

గూడూరు, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. వాస్తవానికి సీజన్ అక్టోబరు 1 నుంచి మొదలు కాగా ఆకాశం వైపు చూస్తున్న రైతులకు వరుణుడి కరుణ ఎట్టకేలకు దక్కింది. దీంతో రైతులు పొలాల మీదకు వెళ్లారు. చేలల్లో నీటిని నింపడం.. నార్లు పోసి దుక్కులు చేయడం ప్రారంభించారు.

గూడూరు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లలో రబీలో వరి సాగు 74 వేల హెక్టార్ల మేర సాగవుతోంది. ఇలా ఏటా రబీ సాగు కాస్త ఆలస్యంగా సాగుతోంది. ఫిల్టర్ పాయింట్ల కింద ఉండే రైతులు మాత్రమే ముందస్తుగా సిద్ధమవుతుంటారు. ఎక్కువగా చెరువులు, వాగులు మీద ఆధారపడ్డ రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తుంటారు. ఈ సీజన్‌లో కొన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. ఇక పంటలేయలేమన్న పరిస్థితుల్లో అల్పపీడనం రైతులకు ధైర్యాన్నిచ్చింది.



దుక్కికి సిద్ధమవుతున్న యంత్రాలు

సమస్యంతా విత్తనాలదే..

రైతు సేవా కేంద్రాల్లో రైతుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన మేర రాయితీ విత్తనాలు ఇవ్వకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కేవలం 5-10 శాతం మేర మాత్రమే విత్తనాలు లభ్యం కావడంతో ప్రైవేటు వ్యాపారుల మీద ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం రైతులకు రెండు రకాల ధాన్యం మాత్రమే అందిస్తుండగా అవి కూడా ఇంకా రైతు సేవా కేంద్రాలకు అందలేదు. అధికారులు ఇండెంట్ పెట్టి తీసుకొస్తామని చెబుతున్నారు.

దళారీల పెత్తనం..

వాస్తవానికి విత్తనాల సమయంలో రైతులు దళారీలను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ ధర ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. ఇలా బస్తాకి రూ.200 వరకు అదనం కాగా ఇచ్చిన ధరలకు వడ్డీ వేస్తారు. ఉదాహరణకు పెళ్లకూరు మండలం చెంబేడుకు చెందిన ఓ దళారీ అంతా తానై వ్యవహరిస్తూ వెనకేసుకున్నట్లు రైతులు చెబుతున్నారు. నాయుడుపేట మండలాల్లో దళారీలు విత్తన వ్యాపారులతో దోస్తీ కట్టి రైతులను ముంచేస్తున్నారు. పైగా ఇచ్చిన విత్తనాల నాణ్యత కూడా ప్రశ్నార్థకంగా ఉంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రబీ ప్రధాన పంటల సాగు ఇలా

డివిజన్	వరిసాగు	పప్పు ధాన్యాలు	వేరుసెనగ (హెక్టార్లలో)
గూడూరు	35,563	872	2,578
సూళ్లూరుపేట	39,399	556	2,694

ఇబ్బందులు లేకుండా చూడాలి



ఈఈ నరేంద్రరెడ్డితో చర్చిస్తున్న నోడల్ అధికారి ఆదిశేషయ్య

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికల నేపథ్యంలో డిస్కం అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ విద్యుత్తు శాఖకి నష్టం వాటిల్లకుండా, సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్, ఉమ్మడి నెల్లూరు జిల్లా సైక్లోన్ నోడల్ అధికారి ఆదిశేషయ్య తెలిపారు. పట్టణ సమీపం నెల్లటూరులోని డిస్కం కార్యాలయంలో ఈఈ నరేంద్రరెడ్డితో తుపానుపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో స్తంభాలు, విద్యుత్తు నియంత్రికలు ముందుగానే సిద్ధంగా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలన్నారు. 1912, 18004251553333 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలన్నారు.

శిథిల బడి.. పెచ్చులూడి



పెళ్లకూరు మండలం యాలకారికండ్రిగ ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులూడి ఉరుస్తోంది. ఇక్కడ 10 మంది విద్యార్థులున్నారు. మంగళవారం స్థానిక రాములోరి గుడిలో తరగతులు నిర్వహించారు. వైకాపా ప్రభుత్వం నాడు-నేడు గొప్పలు చెప్పి ప్రచారానికే పరిమితమైంది. సమస్యను ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బడిని బాగు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెళ్లకూరు**

రోడ్లపై పశువులు.. వాహన చోదకులకు తిప్పలు



సూళ్లూరుపేట పట్టణంలో పశువుల సంచారం ఎక్కువైంది. ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా పశువులు సంచరిస్తున్నాయి. దారిన వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. పశువుల సంచారంపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

దుకాణం తొలగింపు

స్పందనకు వందనం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట దర్గా కూడలిలో రోడ్డుపై కొబ్బరి బోండాలు వేయడంతో అందులో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన పురపాలక సిబ్బంది కొబ్బరి బోండాలను తొలగించి పరిసరాలు శుభ్రం చేశారు.



గుజరాత్‌లో జరిగే పోటీలకు వెళ్తున్న క్రీడాకారులు

జాతీయ పోటీలకు తరలిన క్రీడాకారులు

వెంకటగిరి, న్యూస్‌టుడే: గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి పలువురు క్రీడాకారులు తరలి వెళ్లారు. వెంకటగిరికి చెందిన ఫస్ట్ పార్సల్ బ్లైండ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలనరసయ్య మంగళవారం క్రీడాకారులతో కలిసి గుజరాత్ వెళ్లారు. తిరుపతిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారని ఆ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు.

విద్యుత్తు సమస్యలపై ఫిర్యాదు చేయండి

గూడూరుపట్టణం, న్యూస్‌టుడే: గూడూరు ఒకటో పట్టణం, రెండో పట్టణ పరిధిలో ఏమైనా విద్యుత్తు సమస్యలు ఉంటే డిస్కం అధికారులకు ఫిర్యాదు చేయవచ్చునని డిస్కం ఈఈ నరేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 85006 51603, 94903 82911, 94408 12035, 94408 14287 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు.

గ్రామీణాభివృద్ధి కూటమితోనే సాధ్యం

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇట్టగుంట రత్నయ్య అన్నారు. రూ.10లక్షల వ్యయంతో కల్లూరులో సిమెంటు రోడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచి డిల్లెమ్మ, ఎంపీడీవో గోవర్ధన్, ప్రజా ప్రతినిధులు మంగళవారం భూమి పూజ చేశారు.

బాలాయపల్లి, న్యూస్‌టుడే: అలిమిలి, మన్నూరు, పల్లిపాడు, గొట్టికాడు గ్రామాల్లో మంగళవారం 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఎంపీడీవో వినీల్ కుమార్, ఈవోపీఆర్డీ మోహన్‌రాజు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



దొరవారిసత్రం: సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు

రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్డు

వెంకటగిరి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయని ఎంపీపీ తనూజారెడ్డి అన్నారు. సోమసానిగుంట పంచాయతీ పరిధిలో రూ.15 లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులపై దృష్టి సారించిందన్నారు. ఎంపీడీవో కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాల ప్రజలు వేటకెళ్లొద్దు



భీములవారిపాళెం రేవులో పరిస్థితిని పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

తడ, న్యూస్‌టుడే: మత్స్యకార గ్రామాల ప్రజలు వేటకెళ్లకుండా సురక్షితంగా ఇళ్ల వద్దే ఉండాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి సూచించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని భీములవారిపాళెం వద్ద పులికాట్ రేవులో పరిస్థితిని మంగళవారం ఆమె పరిశీలించారు. భీములవారిపాళెం మత్స్యకార గ్రామంలో పర్యటించారు. తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎస్సై కొండప్ప నాయుడు తదితరులు ఉన్నారు. **సూళ్లూరుపేట:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆర్డీవో కిరణ్మయి, డీఎస్పీ చెంచుబాబుతో కలిసి తడ, సూళ్లూరుపేట మండలస్థాయి అధికారులతో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. **కోట:** కోట మండలం కొత్తపట్నం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం, శ్రీనివాససత్రం సమీపంలోని బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా అలలు ఉద్ధృతంగా ఎగిసి పడుతున్నాయి. తీరం వెంబడి గాలులతో కూడిన జల్లులు పడుతున్నాయి. కోట, చిట్టమూరు మండలాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు పలు శాఖల అధికారులు ముంపు గ్రామాలను పరిశీలించారు. అనంతరం కోట ఎంపీడీవో కార్యాలయంలో తుపాను ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్షా నిర్వహించారు. ముంపు గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు.

రూపుమారనున్న గ్రామాలు

◆ సిద్ధమవుతున్న యంత్రాంగం ◆ పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



మొగళ్లగుంట గ్రామంలో రోడ్డు దుస్థితి

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఐదేళ్ల వైకాపా పాలనలో పల్లె ప్రగతి దుస్థితికి చేరింది. పంచాయతీలకు వచ్చే నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించడంతో గ్రామాల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గ్రామాల పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్లె ప్రగతికి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పలు నిర్మాణ పనులకు భూమి పూజ చేపట్టారు. ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అదనంగా 15వ ఆర్థిక సంఘం, గిరిజన గ్రామాల్లో గిరిజన ఉప ప్రణాళిక నిధులను కూడా వినియోగించనున్నారు. ఈ క్రమంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీడీవో కోటేశ్వరరావు శ్రీకారం చుట్టారు.

రూ.6.03 కోట్ల పనులు..

నియోజకవర్గంలోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల పరిధిలో మొత్తం 132 పనులు చేపట్టనున్నారు. వెంకటగిరిలో రూ.2 కోట్లతో కాలువలు, సిమెంట్ రోడ్డు పనులు చేపట్టనున్నారు. ఇవే కాక ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా మరో 6 పనులు చేయనున్నారు. డక్కిలి మండలంలో 40 పనులకు రూ.2 కోట్లు కేటాయించారు. బాలాయపల్లి మండలంలో 44 పనులకు రూ.2.03 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ఆయా పంచాయతీల పరిధిలో ముందస్తుగా గుర్తించిన పనులు చేపట్టనున్నారు.



పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో

అందరి సహకారం అవసరం

ప్రస్తుతం చేపట్టనున్న పనులన్నీ వచ్చే ఏడాది మార్చి లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పల్లెల్లో ప్రగతి సాధనకు నాయకులు, అధికారులు, సర్పంచుల సహకారం అవసరం. మెరుగైన సౌకర్యాల కల్పనకు పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– కోటేశ్వరరావు, ఎంపీడీవో, వెంకటగిరి

పశుపోషణతో రెట్టింపు ఆదాయం

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పాడి రైతులు ప్రభుత్వం అందించే రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవడం వల్ల రెట్టింపు ఆదాయం పొందవచ్చని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ధనుంజయులు తెలిపారు. మంగళవారం కొత్తూరులో రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో ప్రవీణ, గుణశేఖర్, ప్రదీపిక, అశోక్ పాల్గొన్నారు.



పశు పోషకాహారం రైతులకు అందిస్తున్న ఏడీ ధనుంజయులు

షార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకుడి మృతి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: షార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మాజీ ఎగ్జిక్యూటివ్ మెంబరు, కార్యదర్శి, ఇస్రో జేసీఎం సభ్యుడిగా వివిధ హోదాల్లో పని చేసిన ఆదెప్ప కాశిరెడ్డి అనారోగ్యంతో షార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల షార్ ఉద్యోగులు సంతాపం తెలిపారు.